RNI TEL TEL 2024/89323.

# జన సంఘర్షణ

మా లక్ష్యం సామాన్యుని పక్షం

తెలుగు దినపత్రిక

| నిజామాబాద్ | సంపుటి : 03 | సంచిక : 179 | జులై 29 గురువారం 2026 | ఎడిటర్ : రాచమల్లు మాధవి | పేజీలు 08 | వెల : రూ. 6.00 |
|---|---|---|---|---|---|---|
| Nizamabad | Vol: 03 | Vol: 179 | July 29 Thursday2026 | Editor : rachamallu madhavi | Pages 08 | Cost: Rs 6.00 |


కీలక సాగునీటి ప్రాజెక్టులకు సుప్రీంకోర్టులో భారీ ఊరట 2

## లీక్‌ల బిల్లుపై లోక్‌సభలో గందరగోళం



**న్యూఢిల్లీ జనసంఘర్షణ**
పబ్లిక్ ఎగ్జామినేషన్స్ చట్టానికి సంబంధించిన సవరణ బిల్లుపై లోక్‌సభలో జరిగిన చర్చల సందర్భంగా తీవ్ర గందరగోళం, అధికార-ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం నెలకొంది. విపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ ప్రసంగిస్తూ.. పేపర్ లీకేజీల వల్ల తీవ్ర వేదనకు గురైన విద్యార్థులు ఢిల్లీ వేదికగా ఆందోళన చేపట్టారని, వారి నిరసనను ఒక భావ వ్యక్తీకరణగా చూడాలని పేర్కొన్నారు. విద్యార్థులు శాంతియుతంగా నిరసన తెలుపుతున్నప్పటికీ పోలీసులు వారిని రెచ్చగొట్టేలా ప్రవర్తించారని విమర్శించారు. ప్రభుత్వం తమ ఆవేదనను పట్టించుకోవడం లేదని, 'మూర్ఖులు ఎవరి మాటలూ వినరని' విద్యార్థులు తనతో చెప్పినట్లు పేర్కొన్న రాహుల్ గాంధీ వ్యాఖ్యలపై అధికార పక్ష ఎంపీలు తీవ్ర అభ్యంతరం తెలిపారు. సభలో విద్యార్థుల పేరు చెప్పి ఎంపీలను అవమానిస్తున్నారని భాజపా నాయకులు మండిపడగా, ఆ వ్యాఖ్యలను స్పీకర్ రికార్డుల నుంచి తొలగించారు. అంతేకాకుండా, విద్యావ్యవస్థ వ్యాపారాత్మకంగా, క్రూరంగా

➤ మిగతా 2వ పేజిలో..


## యాంటీ పేపర్ లీక్ బిల్లుకు లోక్‌సభ మూజువాణి ఓటుతో ఆమోదం



**న్యూఢిల్లీ జనసంఘర్షణ**
దేశవ్యాప్తంగా పోటీ పరీక్షల నిర్వహణలో పారదర్శకత పెంచడం మరియు అభ్యర్థుల ప్రయోజనాలను కాపాడడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన యాంటీ పేపర్ లీక్ బిల్లుకు లోక్‌సభ మూజువాణి ఓటుతో ఆమోదం తెలిపింది. వాడీవేడీ చర్చలు, విమర్శలు-ప్రతివిమర్శల మధ్య సాగిన ఈ సభలో ప్రతిపక్షాలు కోరిన పలు సవరణలను ప్రభుత్వం తిరస్కరించింది. కొత్త బిల్లు నిబంధనల ప్రకారం పరీక్షల ప్రశ్నపత్రాల లీకేజీ, ఇతర అక్రమాలకు పాల్పడే దోషులకు ఏకంగా పదేళ్ల వరకు జైలు శిక్షతో పాటు రూ.10 కోట్ల వరకు భారీ జరిమానా విధించేలా కఠిన నిబంధనలు పొందుపరిచారు. గతంలో ఉన్న 3-5 ఏళ్ల జైలు శిక్ష, రూ.10 లక్షల జరిమానాతో పోలిస్తే ఈ నిబంధనలను మరింత కఠినతరం చేశారు. ఈ చర్చలో భాగంగా

➤ మిగతా 2వ పేజిలో..

## తెలంగాణాలో పోలీస్ కొలువులకు నోటిఫికేషన్




**హైదరాబాద్ జనసంఘర్షణ**
తెలంగాణలోని నిరుద్యోగ యువతకు రాష్ట్ర ప్రభుత్వం ఒక గొప్ప అవకాశాన్ని కల్పిస్తూ పోలీస్ శాఖలో భారీ నియామకాలకు శ్రీకారం చుట్టింది. రాష్ట్ర పోలీస్ నియామక మండలి వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న మొత్తం 7,437 పోస్టుల భర్తీ కోసం ఒకేసారి నాలుగు వేర్వేరు నోటిఫికేషన్లను విడుదల చేసింది. పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ చైర్మన్ తెలిపిన వివరాల ప్రకారం... సివిల్, ఏఆర్, స్పెషల్ పోలీస్, స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్, ఫైర్, జైళ్ల శాఖలలో ఈ ఉద్యోగాలను భర్తీ చేయనున్నారు. విభాగాల వారీగా పరిశీలిస్తే... సివిల్ విభాగంలో 3,697 కానిస్టేబుల్ పోస్టులు, ఏఆర్ విభాగంలో 1,052 కానిస్టేబుల్ పోస్టులు అందుబాటులో ఉన్నాయి. అలాగే స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్‌కు సంబంధించి 44 సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్పై), 1,380 కానిస్టేబుల్ ఉద్యోగాలను భర్తీ చేయనున్నారు. ఫైర్ విభాగంలో 39 స్టేషన్ ఫైర్ ఆఫీసర్, 751 ఫైర్ రైటర్ పోస్టులు

➤ మిగతా 2వ పేజిలో..

## కాళేశ్వరంపై కేటీఆర్ మాట్లాడడం సిగ్గుచేటు

### మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



**హైదరాబాద్ జనసంఘర్షణ**
కాళేశ్వరం ప్రాజెక్టుపై మాజీ మంత్రి కేటీఆర్ మాట్లాడటం సిగ్గుచేటని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలోనే నాణ్యతా లోపాలు, నాసిరకం డిజైన్ల వల్ల కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం జరగడం, దెబ్బతినడం రెండూ పూర్తయ్యాయని, ఇప్పటికీ దాన్ని సమర్థించుకునే ప్రయత్నం చేయడం సరికాదని మండిపడ్డారు. ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన ఆయన... బ్యారేజీలో కేవలం 2 నుంచి 3 టీఎంసీలు మాత్రమే నిల్వ చేయాల్సి ఉండగా, అంతకుమించి 10 టీఎంసీలు ఎందుకు నిల్వ చేశారో చెప్పాలని ప్రశ్నించారు. రైతాంగానికి నీళ్లు అందించేందుకు అందుబాటులో ఉన్న అన్ని మార్గాలను తమ ప్రభుత్వం ఉపయోగించుకుంటుందని స్పష్టం చేశారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) ఇచ్చిన నివేదిక మరియు వారి మార్గదర్శకాలకు అనుగుణంగానే ముందడుగు వేస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. బ్యారేజీల పునరుద్ధరణ డిజైన్ల కోసం ఐఐటీ బాంబే, ఆఫ్రో ఇండియా వంటి అంతర్జాతీయ నిపుణుల సాయం తీసుకుంటున్నామని, ప్రస్తుతం మూడు బ్యారేజీలకు సంబంధించి టెస్టింగ్ పనులు వేగంగా జరుగుతున్నాయని

➤ మిగతా 2వ పేజిలో..

## వాయుగుండంతో మూడు రోజులు పాటు వర్షాలు

**హైదరాబాద్ జనసంఘర్షణ**
బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం కారణంగా తెలంగాణ రాష్ట్రంలో రాగల మూడు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ప్రస్తుతం ఈ వాయుగుండం ఉత్తర ఒడిశా, గంగానది

➤ మిగతా 2వ పేజిలో..



# లీక్‌ల బిల్లుపై లోక్‌సభలో గందరగోళం

**మొదటిపేజీ తరువాయి...** తరుమారిందని ఆరోపిస్తూ ఆర్‌ఎస్‌ఎస్ సంస్థే దీని వెనుక ఉందంటూ రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు చేశారు. వర్సిటీల వీసీలుగా ఆర్‌ఎస్‌ఎస్ అనుబంధ వ్యక్తులనే నియమిస్తున్నారని ఆరోపించారు. అనంతరం విద్యార్థులపై జరిగిన పోలీసు చర్యలను ప్రస్తావిస్తూ, ఆందోళనకారులను అణచివేయాలంటూ కేంద్ర హోంమంత్రి అమిత్ షానే ఆదేశించారని రాహుల్ వ్యాఖ్యానించడంపై సభలో మరోసారి రగడ మొదలైంది. హోంమంత్రిపై చేసిన ఆరోపణలకు ఆధారం చూపాలని లేదా క్షమాపణలు చెప్పాలని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు డిమాండ్ చేశారు. పేపర్ లీక్ నిజాలు తెలుసుకోవాలంటే భాజపా నాయకులు తమ పిల్లలనే అడిగి తెలుసుకోవచ్చని స్పష్టం చేసిన రాహుల్, తాను ఎంపీలను విమర్శించలేదని, కేవలం విద్యార్థుల ఆవేదనను వినిపించేందుకు మాత్రమే ప్రయత్నించానని పేర్కొన్నారు.

# కాళేశ్వరంపై కేటీఆర్ మాట్లాడడం సిగ్గుచేటు

**మొదటిపేజీ తరువాయి...** తెలిపారు. గేట్లు ఎత్తి ఉంచడం, కాపర్ డ్యామ్ నిర్మాణం వంటి అంశాల్లో ఎన్డీఎస్‌ఏ సూచించే లిఖితపూర్వక సలహాల ఆధారంగా నిర్ణయాలు ఉంటాయన్నారు. ఈ వ్యవహారంలో సీడబ్ల్యూసీ, తెలంగాణ ప్రభుత్వం, ఎన్డీఎస్‌ఏ అధికారులతో త్వరలోనే సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇక హైడ్రా (న్‌ణ=ూూ) అంశంపై స్పందిస్తూ, అది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిధిలోని మున్సిపల్ శాఖకు సంబంధించిందని, దీనిపై సీఎం స్పందించిన తర్వాత తాను మాట్లాడటం సబబు కాదని పేర్కొన్నారు.

## వాయుగుండప్రభావంతో విస్తారంగా వర్షాలు

### ఉత్తర తెలంగాణలో జోరు వానలతో పొంగుతున్న వాగులు

**హైదరాబాద్** తీవ్ర వాయుగుండం ప్రభావంతో తెలంగాణ వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో వాగులు, నదులు, చెరువులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. పంటలు నీటమునిగాయి. పలు చోట్ల వరద ఉధృతికి రహదారులు కొట్టుకుపోయాయి. దీంతో వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. జలాశయాలు నిండి పోయి జలకళను సంతరించుకున్నాయి. భారీ వర్షాల నేపథ్యంలో పలు జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ఎడతెగకుండా కురుస్తున్న వర్షాలతో భూపాలపల్లి జిల్లా తడిసిముద్దవుతోంది. తీవ్ర వాయుగుండం ప్రభావంతో తెలంగాణలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఇవాళ, రేపు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ

కేంద్రం అధికారులు తెలిపారు. ముఖ్యంగా ఉత్తర, పశ్చిమ, ఈశాన్య తెలంగాణ జిల్లాలకు భారీ వర్ష సూచన ఉందని పేర్కొన్నారు. ఈ జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేసిన వాతావరణ శాఖ.. మిగతా జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని తెలిపింది. హైదరాబాద్‌లో ఆకాశం మేఘావృతమైన వాతావరణంతో పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని వెల్లడించింది.హనుమకొండ, జె.భూపాలపల్లి, జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది. ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, హైదరాబాద్, జనగాం, కామారెడ్డి, ఖమ్మం, కుమురం భీమ్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, మహబూబాబాద్, మంచిర్యాల, మెదక్, ములుగు, సంగారెడ్డి, సిద్దిపేట, సూర్యాపేట, వరంగల్, యాదాద్రి భువనగిరి జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది.

## బిజెపి ప్రాపకం కోసం కెటిఆర్ పాట్లు

### ఢిల్లీ పర్యటన మతలబు ముమ్మాటికీ అదే

### ప్రభుత్వ విప్ బల్మూరి వెంకట్ ఆరోపణ

**హైదరాబాద్, :** కేంద్ర మంత్రులను కలుస్తున్నాననే పేరుతో బీజేపీతో కెటిఆర్ రాయబారం నడుపుతున్నట్లు కనిపిస్తోందని ప్రభుత్వ విప్ బల్మూరి వెంకట్ ఆరోపించారు. కెటిఆర్ ఢిల్లీ పర్యటనపై

వెంకట్ తీవ్ర విమర్శలు గుప్పించారు. కేటీఆర్‌కు ఢిల్లీలో అసలేం పనుందని ప్రశ్నించిన ఆయన.. బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీల మధ్య పొత్తు కోసమే ఢిల్లీలో చర్చలు జరుగుతున్నాయని, వచ్చే ఎన్నికల్లో రెండు పార్టీలు కలిసి పోటీ చేసే అవకాశాలు ఉన్నాయని వ్యాఖ్యానించారు. అమిత్ షా, ప్రధాని నరేంద్ర మోదీ అపాయింట్మెంట్ దొరక్కపోవడంతో తెలంగాణ అంశాల పేరుతో కేంద్ర మంత్రులను కలుస్తున్నట్లు కేటీఆర్ ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. కెటీఆర్ పార్టీ మనుగడ కోసమే ఢిల్లీ వీధుల్లో తిరుగుతున్నారని వెంకట్ అన్నారు. కేసీఆర్ కోసం ఫామ్‌హౌస్‌లో డమ్మీ అసెంబ్లీ పెట్టే పరిస్థితి వస్తుందేమోనని ఎద్దేవా చేశారు. ఉదయం కేంద్ర మంత్రులను కలుస్తున్నానని చెప్పే కేటీఆర్.. రాత్రివేళ ఎవరిని కలుస్తున్నారో తమకు తెలుసని వ్యాఖ్యానించారు. బీఆర్‌ఎస్ ఇప్పుడు ముగిసిన అధ్యాయమని, ప్రజలను తప్పుదోవ పట్టించే రాజకీయాలనే ఆ పార్టీ కొనసాగిస్తోందని విమర్శించారు. కేసీఆర్ నుంచే పచ్చి అబద్దాలు చెప్పే

# యాంటీ పేపర్ లీక్ బిల్లుకు లోక్‌సభ మూజువాణి ఓటుతో ఆమోదం

**మొదటిపేజీ తరువాయి...** కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. రాహుల్‌కు పార్లమెంటరీ వ్యవహారాలపై ఎలాంటి అవగాహన లేదని, ప్రభుత్వం ఏ విధంగా పనిచేస్తుందో ఆయనకు అసలు తెలియదని మండిపడ్డారు. 2024లో యాంటీ పేపర్ లీక్ చట్టం అమల్లోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు 52 ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయని సభకు వివరించారు. మరోవైపు, పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు ప్రతిపక్షాల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. బిల్లుపై స్పష్టమైన చర్చ జరగకుండా అసంబద్ధమైన అంశాలను ప్రస్తావిస్తూ దృష్టి మళ్లిస్తున్నారని ఆరోపించారు. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, అఖిలేష్ యాదవ్, గౌరవ్ గొగోయ్ వంటి విపక్ష నేతలు మాట్లాడిన ఈ చర్చ ముగిసిన అనంతరం బిల్లు ఆమోదం పొందడంతో స్పీకర్ ఓం బిర్లా లోక్‌సభను తదుపరి రోజుకు వాయిదా వేశారు.

# వాయుగుండంతో మూడు రోజులు పాటు వర్షాలు

**మొదటిపేజీ తరువాయి...** పశ్చిమ బెంగాల్ ప్రాంతాల మీదుగా కేంద్రీకృతమై పశ్చిమ వాయవ్య దిశగా పయనిస్తోంది. దీనికి తోడు నైరుతి రుతుపవనాలు కూడా రాష్ట్రంలో ఎంతో చురుగ్గా కదులుతుండటంతో రానున్న రోజుల్లో వర్ష ప్రభావం మరింత ఎక్కువగా ఉండనున్నట్లు అధికారులు వెల్లడించారు. గడిచిన 24 గంటల వ్యవధిలో రాష్ట్రంలోని మెదక్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో పలుచోట్ల జోరుగా వర్షాలు కురిశాయి. ఇందులో అత్యధికంగా ములుగు జిల్లా ఏటూరునాగారంలో 9.64 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. అలాగే మెదక్ జిల్లా చేగుంటలో 8.11 సెం.మీ, మెదక్‌లో 7.68 సెం.మీ, శంకరంపేటలో 6.71 సెం.మీ మేర వర్షం పడింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా పాలెంలో 6.90 సెం.మీ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలో 6.14 సెంటీమీటర్ల మేర వర్షపాతం పడినట్లు గణాంకాలు తెలుపుతున్నాయి.రాబోయే రెండు రోజుల్లో ఆదిలాబాద్, కుమ్రం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయని వాతావరణ శాఖ ప్రకటించింది. మరోవైపు ఎల్ నినో ప్రభావం వల్ల జూన్, జూలై నెలల్లో రాష్ట్రంలో ఏకంగా -49 సెంటీమీటర్ల లోటు వర్షపాతం నమోదైనట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. గత ఏడాది ఇదే సమయానికి తెలంగాణలో 33.3 సెంటీమీటర్ల మేర వర్షపాతం నమోదైనట్లు వాతావరణ నిపుణులు గుర్తుచేశారు.

## పార్టీలైన్ దాటి ఎవ్వరూ మాట్లాడవద్దు

### ఎవరు గీతదాటినా కఠిన చర్యలు తప్పవు

### పార్టీ కార్యకర్తలకు పల్లా, నిమ్మల హెచ్చరిక

**అమరావతి :** టీడీపీ నేతలు కొంతమంది చేస్తున్న వ్యాఖ్యలతో కార్యకర్తలు ఇబ్బంది పడుతున్నారని ఆంధ్రప్రదేశ్ తెలుగుదేశం అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు. అందువల్ల నేతలు పార్టీ లైన్ దాటి మాట్లాడవద్దని ఆదేశించారు. ఎవరైనా గీత దాటితే మాత్రం చర్యలు చాలా కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. కూటమి ధర్మాన్ని అందరు తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. ఈ విషయాన్ని అందరు దృష్టిలో పెట్టుకోవాలని దిశానిర్దేశర చేశారు. బుధవారం అమరావతిలోని టీడీపీ కార్యాలయంలో మంత్రి నిమ్మల రామానాయుడు, పల్లా శ్రీనివాసరావు మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పల్లా శ్రీనివాసరావు మాట్లాడారు. టీడీపీ నేత బోండా ఉమామహేశ్వరరావు ఇచ్చిన వివరణతో టీడీపీ హైకమాండ్ సంతృప్తి చెందిందని తెలిపారు. పార్టీ లైన్ దాటి మాట్లాడిన వారిపై చర్యలు మాత్రం తప్పవని హెచ్చరించారు. పార్టీ నియమావళికి అందరు కట్టుబడి ఉండాలని ఆదేశించారు. వైసీపీ నేతలతో టీడీపీ నేతలు ఎవరు వేదిక పంచుకోవద్దని హుకుం జారీ చేశారు. ఎక్కడైనా నివాళులు అర్పించాల్సి వేస్తే వెళ్లి రావాలని సూచించారు. టీడీపీ అధినేత చంద్రబాబు ఈ విషయంలో చాలా సీరియస్‌గా ఉన్నారని తెలిపారు. అందరు ఈ విషయాన్ని గుర్తు పెట్టుకోవాలని పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు. రాష్ట్ర పునర్ నిర్మాణం కోసం కూటమి ప్రయత్నిస్తోందని ఏపీ జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు వ్యాఖ్యానించారు. రాష్ట్రం కోసం నాడు కూటమి ఏర్పడిందని పేర్కొన్నారు. గొడ్డలి పార్టీ రాష్టాన్ని సర్వనాశనం చేసిందని ధ్వజమెత్తారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు అందరు కూడా అధినేతకు మద్దతు ఇవ్వాలని సూచించారు. పార్టీ సిద్ధాంతాలకు, లైన్‌కు కట్టుబడి పని చేయాలని ఆదేశించారు. మనకు వచ్చిన గౌరవం, అధికారం పార్టీ ద్వారా, చంద్రబాబు ద్వారా వచ్చిందని నేతలు అందరు తెలుసుకోవాలని తెలిపారు. పార్టీ లైన్ దాటిన వారిని, పార్టీకి నష్టం కలిగించే వారు ఎవరైనా కూడా ఎంతటివారు అయినా కూడా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు కూడా బాధ్యతాయుతంగా ఉండాలని మంత్రి నిమ్మల సూచించారు. కూటమి ధర్మాన్ని పాటించకపోతే మాత్రం ఎంతటివారైనా కూడా ఉపేక్షించేది లేదని సీఎం చంద్రబాబు హెచ్చరించారని అన్నారు. కొంతమంది నేతలను పిలిపించి

# తెలంగాణాలో పోలీస్ కొలువులకు నోటిఫికేషన్

**మొదటిపేజీ తరువాయి...** ఉండగా, జైళ్ల శాఖలో మరో 223 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. ఈ నియామక ప్రక్రియను ఆన్‌లైన్ దరఖాస్తుల ద్వారా చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. దరఖాస్తు స్వీకరణ ప్రారంభం మరియు ముగింపు తేదీలను త్వరలోనే అధికారికంగా వెల్లడించనున్నారు. ఈ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవాలనుకునే అభ్యర్థులు ముందుగానే తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పోలీస్ నియామక మండలి సూచించింది. దరఖాస్తు సమర్పించడానికి ముందే, తాము నోటిఫికేషన్‌లో పేర్కొన్న దేహదారుఢ్య (ఫిజికల్) మరియు వైద్య (మెడికల్) ప్రమాణాలకు తగినట్లుగా ఉన్నామో లేదో ఒక సివిల్ సర్జన్ డాక్టర్ వద్ద నిర్ధారించుకోవడం మంచిదని స్పష్టం చేశారు. అంతేకాకుండా, ఎస్సీ కేటగిరీకి చెందిన తెలంగాణ అభ్యర్థులు తమ ఉపకుల వర్గీకరణ స్పష్టంగా తెలిసేలా కుల ధృవీకరణ పత్రాలను ముందుగానే సిద్ధం చేసుకోవాలని బోర్డు చైర్మన్ వివరించారు. దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభ తేదీతో పాటు ఇతర పూర్తి స్థాయి వివరాల కోసం అభ్యర్థులు క్రమం తప్పకుండా అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాల్సిందిగా కోరారు.

## కీలక సాగునీటి ప్రాజెక్టులకు సుప్రీంకోర్టులో భారీ ఊరట

తెలంగాణలోని పాలమూరు-రంగారెడ్డి, సీతమ్మ సాగర్, గౌరవెల్లి రిజర్వాయర్ వంటి కీలక సాగునీటి ప్రాజెక్టులకు సుప్రీంకోర్టులో భారీ ఊరట లభించింది. కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ 2021లో జారీ చేసిన ఆఫీస్ మెమోరాండంను అత్యున్నత న్యాయస్థానం రద్దు చేసినప్పటికీ, ఆ మెమోరాండం ఆధారంగా ఇప్పటికే మంజూరైన పర్యావరణ అనుమతులన్నీ పూర్తిగా చెల్లుబాటులోనే ఉంటాయని స్పష్టం చేసింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్య కాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ తీర్పు కేవలం భవిష్యత్తుకు మాత్రమే వర్తిస్తుందని (ప్రోస్పెక్టివ్) తేల్చిచెప్పడంతో, ప్రస్తుతం రాష్ట్రంలో వేగంగా సాగుతున్న ప్రాజెక్టుల నిర్మాణ పనులకు ఎలాంటి చట్టపరమైన ఆటంకాలు ఉండబోవని ధీమా వ్యక్తమవుతోంది. అదే సమయంలో, భవిష్యత్తులో చేపట్టబోయే ఏ కొత్త ప్రాజెక్టైనా పనులు ప్రారంభించడానికంటే ముందే తప్పనిసరిగా పర్యావరణ అనుమతులు పొందాలని ధర్మాసనం స్పష్టం చేసింది. కేవలం కార్యనిర్వాహక ఉత్తర్వులు లేదా మెమోరాండాల ద్వారా చట్టబద్ధమైన నిబంధనలను దాటవేయడం సాధ్యంకాదని వ్యాఖ్యానించిన కోర్టు, అత్యవసర లేదా ప్రత్యేక పరిస్థితుల్లో మినహాయింపులు ఇవ్వాల్సి వస్తే కేంద్ర ప్రభుత్వం అందుకు తగిన చట్టబద్ధ నోటిఫికేషన్‌ను మాత్రమే జారీ చేయాలని సూచించింది. ఇప్పటికే పూర్తయిన మరియు శరవేగంగా నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులకు పూర్తి స్థాయి రక్షణ కల్పిస్తూ సుప్రీంకోర్టు తీర్పు వెలువరించడం తెలంగాణ సాగునీటి రంగానికి, రాష్ట్ర ప్రభుత్వానికి ఎంతో ఊరటనిచ్చే అంశం.

## జగన్ క్రెడిట్ కొట్టేయాల్సిన ఖర్మ పట్టలేదు

### ఎర్రబస్సు రాని భోగాపురానికి ఎయిర్‌పోర్టా

### గతంలో జగన్ వ్యాఖ్యలను ప్రస్తావించిన కలిశెట్టి

**న్యూఢిల్లీ :** భోగాపురం ఎయిర్‌పోర్ట్ క్రెడిట్.. చంద్రబాబు కొట్టేస్తున్నారంటూ వైసీపీ అధ్యక్షుడు, పులివెందుల ఎమ్మెల్యే జగన్ మోహన్ రెడ్డి మాట్లాడడం హాస్యాస్పదమని టీడీపీ ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు వ్యాఖ్యానించారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. జగన్ ప్రతిపక్షనేతగా ఉన్నపుడు భోగాపురం వచ్చి.. ఎర్రబస్సు రాని భోగాపురానికి ఎయిర్‌పోర్ట్ ఎందుకన్నారని గుర్తుచేశారు. జగన్ క్రెడిట్ ఎవరూ చోరీ చేయరని.. ఆయన క్రెడిట్ చోరీ చేస్తే జైలుకే వెళతారంటూ సెటైర్ విసిరారు. జగన్ వ్యవహారం చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని ఎంపీ అన్నారు. ఉత్తరాంధ్ర ప్రజలను అవమానించే విధంగా వైసీపీ అధినేత మాట్లాడారని విమర్శించారు. ఎర్రబస్సు రాని ప్రాంతానికి ఎయిర్ బస్ ఎలా వస్తుందని అవహేళన చేశారన్నారు. భోగాపురం ఎయిర్‌పోర్ట్ ప్రారంభోత్సవానికి ప్రధాని నరేంద్ర మోదీ రాబోతున్నారని తెలిపారు. నారా లోకేశ్ ఆధ్వర్యంలో విద్యాశాఖ అద్భుతంగా ముందుకు వెళుతోందని చెప్పుకొచ్చారు. డీఎస్సీలో ఎలాంటి అవకతవకలు జరగకుండా చర్యలు తీసుకున్నారని తెలిపారు. లోకేశ్ వేసిన సవాల్‌కు జగన్ పారిపోయారన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు దేశానికి, తెలుగు ప్రజలకు ఒక ఆదర్శమని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు కొనియాడారు.

# ఎన్నికల హామీ వద్దిపేట చెక్ డ్యామ్

- ఎత్తిపోతల పథకం కింద చర్ల మండలం వద్దిపేట చెక్ డ్యాం నిర్మాణం చేపట్టాలని న్యూ డెమోక్రసి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావుకి వినతి పత్రం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, చర్ల మండలం, జులై 29(జనసంఘర్షణ):

ఎమ్మెల్యే తెల్ల వెంకటరావు అధికారం లోకి వచ్చే ముందు చర్ల మండలంలో గిరిజన ఆదివాసీలు సాగు చేసుకునే 25వేల ఎకరాల పంట భూములకు వద్దిపేట చెక్ డ్యాం ద్వారా ఎత్తిపోతల పథకం కింద నీళ్లు అందిస్తానని హామీ ఇచ్చారు. కానీ నిలబెట్టుకోలేకపోయారు, తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం నుండి నిధులు తీసుకొచ్చి వద్దిపేట చెక్ డ్యాం నిర్మించి గిరిజన ఆదివాసి రైతులకు నీళ్లు అందించాలని,సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ పార్టీ భద్రాచలం డివిజన్ కార్యదర్శి కామ్రేడ్ ముసలి సతీష్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యావత్ ప్రపంచానికి అన్నం పెట్టే రైతన్నకు రెండు పంటలు పండించుకోవడానికి నీళ్లు అందించకపోవడంలో పాలకులు అధికారులు విఫలమయ్యారని దశాబ్దాలు గడిచిపోతున్న పాలకులు చెక్ డ్యాం నిర్మాణం పట్టించు కోకపోవడం ఇది చాలా దుర్మార్గం అయిన పరిస్థితిని ఆయన అన్నారు, చర్ల మండలంలో ఉన్న రైతులకు రెండు పంటలకు నీళ్లు అందించే విదంగా పాలకులు ఎత్తిపోతల పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వాన్ని నిధులు తీసుకొచ్చి చెక్ డ్యాం పనులు మొదలు పెట్టాలని ఆయన అన్నారు, తక్షణమే ఎత్తిపోతల పథకం కింద చర్ల మండలంలో సాగులో ఉన్న 25వేల ఎకరాలకి ఎత్తిపోతల పథకం కింద సాగు నీరు అందించాలని అధికారంలోకి రాకముందు ఎమ్మెల్యే



తెల్లం వెంకట్రావు మొట్టమొదట ఇచ్చిన హామీ చెక్ డ్యాం ఎత్తిపోతల పథకం ద్వారా నీళ్ళు అందిస్తానని చెప్పిన మాటను నెరవేర్చుకోవాలని సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ పార్టీగా డిమాండ్ చేస్తున్నాం. లేనియెడల చర్ల మండలం లో ఉన్న రైతులందరినీ ఐక్యం చేసుకొని ఉద్యమాలు చేపడతామని హెచ్చరిస్తున్నాం. కార్యక్రమంలో న్యూ డెమోక్రసీ నాయకులు, ప్రజలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయ కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి

- వ్యవసాయ కూలీలకు కరువు బత్యంగా నెలకు 7500రూపాయలు చెల్లించాలి.
- భద్రాద్రి కొత్తగూడెం ను కరువు జిల్లాగా ప్రకటించాలి.
- ఏఐపీకేఎంఎస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ డిమాండ్
- ఈనెల ఆగస్టు 10 న కలెక్టరేట్ ధర్నాను జయప్రదం చేయండి.




భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, భద్రాచలం, జులై 29(జనసంఘర్షణ):

వ్యవసాయ కార్మికులకు కరువు బత్యంగా 7500 చెల్లించాలని అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జాటోతు కృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆ సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం ఆ సంఘం జిల్లా అధ్యక్షులు గోకినపల్లి ప్రభాకర్ అధ్యక్షతన జరిగింది. అందులో ఆయన పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితుల వల్ల కరువు నెలకొందని వ్యవసాయ కార్మికులకు ఉపాధి లేక వలసలు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల హామీలను ప్రభుత్వం వ్యవసాయ కార్మికులకు 12 వేల రూపాయల జీవన బృతి ఇస్తానన్న హామీని కూడా నెరవేర్చాలని ఆయన డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో ఆగస్టు మూడు నుండి మండల, డివిజన్ కార్యాలయాల్లో డిమాండ్ తో కూడిన వినతి పత్రాలు సమర్పించాలని, ఆగస్టు 10న రాష్ట్రంలో ఉన్న అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మెమోరాండం ఇవ్వాలని ఆయన తెలియజేశారు. ఆగస్టు 20 తర్వాత ప్రభుత్వం పై డిమాండ్స్ నెరవేర్చకపోతే ప్రత్యక్ష ఆందోళన కార్యక్రమాలకు వ్యవసాయ కార్మికులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు నాయిని రాజు, చింతకాయల సరళ, వెంకటమ్మ శాస్త్ర, బోయిన వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాల సమీక్షా సమావేశం

- కల్యాణలక్ష్మి, షాదిముబారక్ చెక్ ల పంపిణి.
- ఏమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు.
- కలుపు మందు నివారణకు చర్యలు తీసుకోవాలి.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, చర్ల మండలం, జులై 29(జనసంఘర్షణ):

చర్ల మండలం రైతు వేదికలో మంగళవారం భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు మండల స్థాయి సమీక్ష సమావేశంలో పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కళ్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ చెక్కులను పంచడం జరిగింది. అదేవిధంగా చర్ల మండల అభివృద్ధి కార్యక్రమాలపై వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం రాత్రి 8 గంటల వరకు జరిగింది. పట్టువదలని విక్రమార్కుడిలా రాత్రి 8 గంటలకు కూడా సమావేశం నిర్వహించడం నాయకులకు, ప్రజలకు చాలా సంతోషం అనిపించింది. ఈ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ వర్షాకాలం సందర్భంగా అంటువ్యాధులు రాకుండా అధికారులను పర్యవేక్షించమని కోరడం జరిగింది. వ్యవసాయం నీటిపారుదల గురించి సమీప ఇంజనీర్లతో సంప్రదించి రైతులకు నష్టం చేకూరే విధంగా చేయవద్దని కోరడం జరిగింది. వ్యవసాయ అధికారులతో కలుపు మందు కొట్టడం ద్వారా రైతులకు కనబడకుండా కిడ్నీలు, ఊపిరితిత్తులు, గుండె సంబంధిత వ్యాధులు దగ్గరవుతున్నందున వ్యవసాయ అధికారులు గమనించి కలుపు మందు నివారణ గురించి పటిష్టమైన కట్టేదిట్టమైన చర్యలు చేపట్టి కలుపు మందులు నివారించమని చెప్పడం జరిగింది. అంగన్వాడి కేంద్ర సమస్యలపై చర్చించి,108, అంగన్వాడీ కేంద్రాల్లో సిబ్బంది కొరతపై చర్చించడం జరిగింది. హౌసింగ్ జేఈతో మాట్లాడుతూ..ప్రభుత్వం కేటాయించిన ఇండ్లను కట్టుకొని వారిని మినహాయించి కొత్తవారికి ఆ ఇల్లు ఇచ్చే విధంగా చూడమని సంబంధిత ఎండిఓ కి ఆదేశించడం జరిగింది.



పశు వైద్య శాఖ అధికారులతో రైతులలో గొర్రెలు, మేకలు పెంపకం, ములగ తోట, గేదెల పెంపకం, తదితర విషయాలు చర్చించి వాటి అభివృద్ధికి తోడ్పడాలని అధికారులతో చెప్పడం జరిగింది. ఈ మండల స్థాయి సమావేశానికి హాజరుకాని సిబ్బంది, మిషన్ భగీరథ, ఫారెస్ట్,ఆర్ అండ్ బి, పంచాయతీ రాజ్, డిపార్ట్మెంట్లకు నోటీసులు పంపవలసినదిగా ఎండిఓ ని ఆదేశించడం అయినది. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ ఇందల గోపాల బుచ్చిబాబు, సభాధ్యక్షులుగా ఏడి సుధాకర్, ఎంపీడీవో ఈదయ్య, ఎంఆర్ఓ శ్రీనివాస్, తాలిపేరు డి ఇ తిరుపతిరావు, చర్ల మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ సామ్రాజ్యం, వ్యవసాయ శాఖ అధికారిని ఏవో లావణ్య, నీటిపారుదల శాఖ ఇంజనీర్లు ఈ ఈ సమావేశంలో పాల్గొనడం జరిగింది.

# నిరుపేద విద్యార్థులకు రోటరీ ట్రస్ట్ చేయూత

- ఉచిత సైకిళ్ల పంపిణీ..
- విద్యార్థుల చదువుకు ప్రోత్సాహం......

పోతంగల్/, జూలై 29/ (జనసంఘర్షణ):

బోధన్ డివిజన్ పరిధిలోని పోతంగల్ మండలంలో నిరుపేద విద్యార్థులకు రోటరీ ట్రస్ట్ ఆఫ్ మొయినాబాద్, నిజామాబాద్, బోధన్ ఆధ్వర్యంలో ఉచిత సైకిళ్లను పంపిణీ చేశారు. పోతంగల్ జడ్పీహెచ్ఎస్ పాఠశాల, కారేగాం పాఠశాలలో చదువుతున్న ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు సైకిళ్లను అందజేశారు. ఈ సందర్భంగా పోతంగల్ మండల విద్యాశాఖ అధికారి సాయిలు మాట్లాడుతూ.. నిరుపేద విద్యార్థుల విద్యాభ్యాసానికి రోటరీ ట్రస్ట్ అందిస్తున్న సహాయ సహకారాలు అభినందనీయమని అన్నారు. విద్యార్థుల అవసరాలను గుర్తించి వారికి ఉచితంగా సైకిళ్లు అందించడం ద్వారా చదువుపై



మరింత ఆసక్తి పెంపొందించేందుకు ట్రస్ట్ చేస్తున్న కృషికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తుకు అండగా నిలుస్తూ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న రోటరీ ట్రస్ట్ ప్రతినిధులను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో బోధన్ నియోజకవర్గ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, విద్యాశాఖ అధికారులు, పాఠశాలల ఉపాధ్యాయులు, రోటరీ ట్రస్ట్ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# పోకల దమ్మక్క యాత్ర ఘనంగా ప్రారంభం

- పాల్గొన్న స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,భద్రాచలం నియోజకవర్గం, జులై 29(జనసంఘర్షణ):



భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయం ఆవరణలో పోకల దమ్మక్క యాత్ర బుధవారం ఘనంగా ప్రారంభమైంది. ఆదివాసీ సంప్రదాయ నృత్యాలు, సాంస్కృతిక ప్రదర్శనల మధ్య ప్రారంభమైన ఈ యాత్ర భారీ ర్యాలీగా పట్టణ ప్రధాన వీధుల గుండా కొనసాగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు , భద్రాచలం మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పూనెం కృష్ణ, శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం కార్యనిర్వహణాధికారి దామోదర్ , ఆదివాసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు. ర్యాలీ అనంతరం శ్రీ పోకల దమ్మక్క విగ్రహానికి ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు పూలమాల వేసి, ఆమె సేవలను స్మరించుకున్నారు. అనంతరం తానిషా మండపం వెనుక ఉన్న టిటిడి కళ్యాణ మండపంలో శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తులందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి దర్శనం చేసుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు, వార్డు సభ్యులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, మహిళలు, ఆదివాసీ సంఘాల ప్రతినిధులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎస్ ఐ ఆర్ మండల ప్రవాస్ అభియాన్

- బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు కందుల కిషోర్ పర్యటన

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, చర్లమండలం, జూలై 29(జనసంఘర్షణ):





తెలంగాణ భారతీయ జనతా పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎస్ ఐ ఆర్ మండల ప్రవాస్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు కందుల కిషోర్ చర్ల మండలంలో పర్యటన నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఎస్ ఐ ఆర్ కార్యక్రమం అమలు తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించి, నమోదును మరింత వేగవంతం చేయడం, ఎదురవుతున్న సమస్యలను గుర్తించి పరిష్కరించే దిశగా పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా చర్ల పట్టణంలోని 63,68, 74, 81,79,77,70, 69,పోలింగ్ బూత్‌లను సందర్శించి, ఆయా బూత్‌ల బూత్ లెవల్ అధికారులను బి యల్ ఓ లను కలిసి ఇప్పటివరకు జరిగిన ఎస్ ఐ ఆర్ నమోదు పురోగతి, నమోదైన శాతం, ఎదురైన సమస్యలు, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం చర్ల ఎమ్మార్వో శ్రీనివాస్ ని కార్యాలయంలో కలిసి, చర్ల మండలంలోని ఎస్ ఐ ఆర్ కార్యక్రమానికి సంబంధించిన సమగ్ర నివేదికను పరిశీలించి, నమోదు ప్రక్రియ పురోగతిపై చర్చించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ చర్ల మండల అధ్యక్షులు నూప రమేష్, మండల ప్రధాన కార్యదర్శి బోడిక సందీప్, మండల కార్యదర్శి ముత్తవరపు శ్రీనివాస్ చారి జిల్లా కౌన్సిలర్ నెంబర్ బాబా పాహిం జిల్లా కార్యవర్గ సభ్యులు రమణ, కంపెల్ల ప్రభాకర్ యువమోర్చా పి వినయ్, ఎస్ ఐ ఆర్, బిఎల్ ఏ మల్లాల ప్రశాంత్, చుక్క శివ, చింతూరి విశ్వనాథ్, కుప్ప మాధవరావు, గుమ్మల వెంకన్న, ఉయిక రాంబాబు, సంతపూరి సతీష్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# భారీ వర్షాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- అత్యవసర పని ఉంటేనే బయటకు రావాలి
- కాంగ్రెస్ పార్టీ చర్ల మండల అధ్యక్షులు విజయ్ నాయుడు


భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,చర్ల మండలం , జూలై 29(జనసంఘర్షణ):




రాబోయే రెండు రోజులపాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో, ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని కాంగ్రెస్ పార్టీ చర్ల మండల అధ్యక్షులు విజయ్ నాయుడు కోరారు. భారీ వర్షాల కారణంగా వాగులు, వంకలు, చెరువులు పొంగిపొర్లే అవకాశం ఉన్నందున ప్రజలు అనవసర ప్రయాణాలు చేయవద్దని సూచించారు. అత్యవసర పని ఉంటేనే ఇళ్ల నుంచి బయటకు రావాలని, వరద నీరు ప్రవహించే ప్రాంతాల్లోకి వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు, గర్భిణీలు ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలని, రైతులు పొలాలకు వెళ్లే సమయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విద్యుత్ తీగలు తెగిపడిన ప్రాంతాలు, బలహీనమైన చెట్లు, శిథిలావస్థలో ఉన్న భవనాల సమీపంలో సంచరించకుండా జాగ్రత్త వహించాలని కోరారు. ప్రజలందరూ అధికార యంత్రాంగం జారీ చేసే సూచనలను తప్పకుండా పాటించి, అవసరమైతే స్థానిక అధికారులకు సమాచారం అందించాలని విజయ్ నాయుడు విజ్ఞప్తి చేశారు. భారీ వర్షాల నేపథ్యంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండి తమ కుటుంబ సభ్యుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన పిలుపునిచ్చారు.

# గురు పౌర్ణమి సందర్భంగా ఆలయాల్లో ఘనంగా పూజలు

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జులై 22 (జన సంఘర్షణ)





తెలంగాణ రాష్ట్రంలో మెదక్ జిల్లా శివంపేట మండల్‌లో గురువు పూర్ణమి రోజు సందర్భంగా శివంపేట మండల్ లోవెలిసిన బంగాళముఖి అమ్మవారిని అలాగే గూడూరు గ్రామంలో వెలిసిన సాయిబాబా గురువు దత్తాత్రేయ స్వామి ఆలయాలు తెలంగాణ రైతు రక్షణ సమితి మెదక్ జిల్లా గౌరవ అధ్యక్షులు అక్క మొల్ల మైసయ్య యాదవ్ దర్శించుకుని తెలంగాణ రాష్ట్రంలో అధికంగా వర్షాలు గురించి కుంటలు చెరువులు నిండి పొంగాలి అన్నారు. రైతులకు అధికంగా పంటలు పండాలి పుష్కలంగా పండాలని శ్రీ అమ్మవారిని, శ్రీ సాయిబాబా దత్తాత్రేయ స్వామి ప్రత్యేకంగా ఆశీస్సులు రైతుల పైన రైతంగం పైన ఉండాలని అమ్మవారిని ఆ భగవంతుని కోరారు. పాడిపంటలు పచ్చగా ఉండాలని రైతుల పక్షాన ఆ భగవంతుని మైసయ్యయాదవ్ కోరారు. జై కిసాన్ జై జై కిసాన్.

# కోటగిరి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా పి.కృష్ణ

❑ నూతన కార్యవర్గానికి ఘన సన్మానం..
శుభాకాంక్షలు తెలిపిన సభ్యులు

కోటగిరి, జూలై 29 (జన సంఘర్షణ): కోటగిరి ఉమ్మడి మండలాల ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గం ఇటీవల ఎన్నికైన సందర్భంగా పాత ప్రెస్ క్లబ్ కార్యవర్గం, సభ్యుల ఆధ్వర్యంలో నూతన కార్యవర్గ సభ్యులను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. నూతన ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా పి.కృష్ణ (వీ6 వెలుగు), ప్రధాన కార్యదర్శిగా బి.సాయిలు (ప్రభ న్యూస్), ఉపాధ్యక్షుడిగా పి.సైదయ్య (తెలంగాణ పత్రిక), కోశాధికారిగా జి.రాము (జనం సాక్షి), సహాయ కార్యదర్శిగా పి.పెంటయ్య (ఆంధ్రప్రభ) ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ గౌరవ అధ్యక్షుడు జి.హనుమంతరావు మాట్లాడుతూ.. నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు ఉమ్మడి కోటగిరి మండలాల ప్రెస్ క్లబ్ అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు. ప్రెస్ క్లబ్ అభివృద్ధికి నూతన కార్యవర్గానికి సభ్యుల సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు. గతంలో ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఉమ్మడి కోటగిరి మండలాల్లో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించామని, భవిష్యత్తులో మరిన్ని సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టేందుకు మండలాల నాయకులు, ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ సభ్యులు సాయిబాబా గౌడ్,



కాసుల శ్రీకాంత్, అనిల్, బేగరి రాములు, నరేష్, గంట్ల రాజు, మీడియా టుడే రాజు, హైమద్, పబ్బ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# నిజాంసాగర్‌లోకి జోరుగా వరదనీరు.. రైతుల కళ్లల్లో ఆనందం!

❑ ప్రాజెక్టులోకి 6,585 క్యూసెక్కుల వరద ఇన్‌ఫ్లో..
అవుట్‌ఫ్లో 141 క్యూసెక్కులు

బాన్సువాడ ప్రతినిధి / జూలై 29 (జన సంఘర్షణ): నిజాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాల నుంచి వరదనీరు క్రమంగా చేరుతుండటంతో ప్రాజెక్టు నీటిమట్టం రోజురోజుకూ పెరుగుతోంది. దీంతో ఆయకట్టు రైతుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. ప్రాజెక్టులోకి భారీగా వరదనీరు చేరుతుండటంతో ఈ ఏడాది సాగునీటికి ఢోకా ఉండదనే ఆశాభావం రైతుల్లో వ్యక్తమవుతోంది. బుధవారం ఉదయం 6 గంటల వరకు నిజాంసాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1,405.00 అడుగులు కాగా, ప్రస్తుత నీటిమట్టం 1,395.40 అడుగులకు చేరుకుంది. ప్రాజెక్టులో ప్రస్తుతం 7.139 టీఎంసీల నీటి నిల్వ




ఉన్నట్లు అధికారులు తెలిపారు. గత ఏడాది ఇదే రోజున ప్రాజెక్టు నీటిమట్టం 1,391.25 అడుగులు ఉండగా, నీటి నిల్వ 4.597 టీఎంసీలుగా నమోదైంది. గతేడాదితో పోలిస్తే ప్రస్తుతం ప్రాజెక్టులో నీటిమట్టం, నీటి నిల్వ గణనీయంగా పెరగడం రైతులకు శుభవార్తగా మారింది. గడిచిన 24 గంటల్లో ప్రాజెక్టులోకి సగటున 6,585 క్యూసెక్కుల వరద ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ఇతర మార్గాల ద్వారా నీటి విడుదల లేకపోగా, ఆవిరి రూపంలో సుమారు 141 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఎగువ ప్రాంతాల నుంచి వరద ప్రవాహం కొనసాగుతుండటంతో అధికారులు ప్రాజెక్టు పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. నిజాంసాగర్‌లోకి వరదనీరు చేరుతుండటంతో ఆయకట్టు రైతుల కళ్లల్లో ఆనందం కనిపిస్తోంది. ప్రాజెక్టు నీటిమట్టం మరింత పెరిగి, పంటలకు సమృద్ధిగా సాగునీరు అందాలని రైతులు ఆశిస్తున్నారు.

# దొంగతనాలకు పాల్పడితే కఠిన చర్యలు

❑ రాజారాం దుబ్బలో భారీ కార్డెన్ సర్చ్..
❑ నేరస్తులకు పోలీసుల హెచ్చరిక

బాన్సువాడ ప్రతినిధి/జూలై 29/(జన సంఘర్షణ): బాన్సువాడ పట్టణంలోని రాజారాం దుబ్బలో బుధవారం ఉదయం పోలీసు శాఖ ఆధ్వర్యంలో భారీ కార్డెన్ సర్చ్ నిర్వహించారు. ఒకవైపు వర్షం కురుస్తున్నప్పటికీ వందలాది మంది పోలీసు సిబ్బంది కాలనీలోకి ప్రవేశించి విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. దీంతో స్థానికులు ఒక్కసారిగా అప్రమత్తమయ్యారు. కార్డెన్ సర్చ్‌లో భాగంగా రాజారాం దుబ్బ ప్రాంతంలోని ప్రధాన రహదారులు, కాలనీలోకి వెళ్లే మార్గాలు, సందుల వద్ద పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహించారు. కాలనీని పూర్తిగా చుట్టుముట్టిన పోలీసులు ఇళ్ల వరుసలు, రోడ్లు, దుకాణాలను తనిఖీ చేసి అనుమానాస్పద వ్యక్తులను విచారించారు. సరైన ధ్రువపత్రాలు లేని కొన్ని వాహనాలను అక్కడికక్కడే సీజ్ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ విట్టల్ రెడ్డి మాట్లాడుతూ.. గంజాయి, మాదకద్రవ్యాలు వంటి సామాజిక రుగ్మతలకు ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలని సూచించారు. దొంగతనాలు, దోపిడీలు, ఇతర





అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కాలనీకి మంచి పేరు తీసుకురావడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. నంబర్ ప్లేట్ లేకుండా, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కార్డెన్ సర్చ్‌లు నిర్వహించడం ద్వారా చట్టవ్యతిరేక కార్యకలాపాలు, దొంగతనాలు, మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టడంతో పాటు నేరస్తుల కదలికలను గుర్తించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. ఇలాంటి తనిఖీలు భవిష్యత్తులోనూ కొనసాగుతాయని వెల్లడించారు.

**అధికారులకు హెచ్చరిక:** కాలనీల్లో దొంగతనాలు, గంజాయి, మాదకద్రవ్యాల వినియోగం, ఇతర అసాంఘిక కార్యకలాపాలపై పోలీసులు మరింత నిఘా పెంచాల్సిన అవసరం ఉంది. నేరాలు జరిగిన తర్వాత చర్యలు తీసుకోవడమే కాకుండా, నేరాలకు అవకాశం లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

**ప్రజలకు హెచ్చరిక:** నేరాలకు పాల్పడే వ్యక్తులకు సహకరించడం, అనుమానాస్పద కార్యకలాపాలను చూసి మౌనం వహించడం కూడా సమాజానికి నష్టం కలిగిస్తుంది. అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలపై సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేసి శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజలు భాగస్వాములు కావాలి. ఈ కార్యక్రమంలో సీఐ తుల శ్రీధర్, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## అంత్యక్రియలకు ఆర్థిక సహాయం అందజేత

❑ ఆపదలో అండగా నిలిచిన 'అన్నదమ్ముల అనుబంధం - తెల్ల రవి అన్న యువసేన'

కోటగిరి, జూలై 29 (జనసంఘర్షణ): ఆపదలో ఉన్న కుటుంబానికి అండగా నిలిచి, మానవత్వమే నిజమైన సేవ అని చాటిచెప్పింది,అన్నదమ్ముల అనుబంధం - తెల్ల రవి అన్న యువసేన'. కోటగిరి మండల కేంద్రంలోని హరిజనవాడకు చెందిన జెండా గంగారం బుధవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న యువసేన సభ్యులు వెంటనే స్పందించి, మృతుని కుటుంబాన్ని పరామర్శించి అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం రూ.5,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా యువసేన సభ్యులు మాట్లాడుతూ.. కష్టకాలంలో ఉన్న కుటుంబాలకు తమవంతు సహాయం అందించడం తమ బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు. ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడం ద్వారా సమాజంలో మానవత్వం, సేవాభావం మరింత పెంపొందుతాయని పేర్కొన్నారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయం అందించిన యువసేన సభ్యుల సేవాభావాన్ని కాలనీవాసులు, స్థానికులు అభినందించారు. కష్టాల్లో ఉన్నవారికి చేయూతనిస్తూ, ఆపదలో తోడుగా నిలవడం ప్రతి ఒక్కరికీ ఆదర్శంగా నిలుస్తుందని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో తెల్ల అరవింద్, తెల్ల రవికుమార్, కాలనీవాసులు, పెద్దలు కన్నం సాయిలు, కన్నం శ్రీనివాస్, జెండా దినేష్, హస్గుల రవి, పందు తదితరులు పాల్గొన్నారు.



## గురు పౌర్ణమి సందర్భంగా సాయిబాబా ఆలయంలో ఎమ్మెల్యే పోచారం ప్రత్యేక పూజలు

నస్రుల్లాబాద్ ప్రతినిధి / జూలై 29 (జన సంఘర్షణ):




గురు పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని బాన్సువాడ నియోజక వర్గం నస్రుల్లాబాద్ మండలం నెమ్లి గ్రామంలోని సాయిబాబా ఆలయాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, బాన్సువాడ నియోజకవర్గ శాసనసభ్యులు పోచారం శ్రీనివాస్ రెడ్డి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా సాయినాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆలయ అర్చకుల ఆశీర్వాదాలు స్వీకరించారు. అనంతరం ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో పుష్కలంగా వర్షాలు కురిసి, పంటలు సమృద్ధిగా పండాలని, ప్రతి అన్నదాత కుటుంబంలో ఆనందోత్సవాలు వెల్లివిరియాలని సాయినాథుని ప్రార్థించినట్లు తెలిపారు. గురు పౌర్ణమి సందర్భంగా సాయిబాబా ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నస్రుల్లాబాద్ మండల ప్రజాప్రతినిధులు, నాయకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## వరుణదేవా ... ఒకసారి కరుణించవా!

జులై 29(జనసంఘర్షణ)






నింగిని చూసి నా చూపులు
నిత్యం నీ దారే వెతుకుతున్నాయి...
మేఘమై వస్తావని ఆశిస్తే,
మౌనమే మిగిల్చి వెళ్లిపోతున్నావు.
దున్నిన నేల దాహంతో దగ్ధమై,
విత్తిన విత్తనం ఊపిరాడక విలవిల్లాడుతోంది.
పచ్చని పైరు పాడైపోతుంటే
నా ప్రాణమే ముక్కలవుతోంది.
వరుణ దేవా! నీ చినుకే మా జీవగీతం,
నీ జల్లే మా పిల్లల చిరునవ్వు.
నీవు లేని ఈ భూమి
తల్లిలేని బిడ్డలా బోసిపోయింది.
అప్పుల బరువుతో భుజాలు వంగిపోయాయి,
ఆశల మొక్కలు ఎండలో కూలిపోయాయి.
కన్నీటి చుక్కలే ఇప్పుడు
నా పొలానికి నీరై పారుతున్నాయి.
ఓ మేఘరాజా!
నా ఆక్రందనం నీ చెవిని చేరలేదా?
అన్నదాతల కళ్లలోని బెంగ,
నా పిల్లల ఆకలి నీ మనసును కదిలించలేదా?
ఒక్కసారి కరుణగా కురిసి చూడు,
ఈ నేల మళ్లీ నవ్వుతుంది.
ఎండిన చెట్టు చిగురిస్తుంది,ఈ
రైతు గుండెలో ఆశ మళ్లీ మొలుస్తుంది.
నీ ఒక్క జల్లుకై
వేల కళ్లతో ఎదురుచూస్తున్నాం.
వరుణాదేవా! ఆలస్యం చేయకు...
మా బతుకుల దీపం ఆరిపోకముందే
అమృతధారలై కురిసి,
అన్నదాత కన్నీటిని ఆనందధారగా మార్చు!

కలం : బత్తుల. వెంకటేశ్వర్లు, చర్ల.

## ఆగస్టు 5న బాన్సువాడ నియోజకవర్గంలో ఎమ్మార్పీఎస్ నూతన మండల కమిటీల ఎన్నిక

❑ పాత కమిటీలు రద్దు.. ఆరు మండలాలకు నూతన కమిటీల ఏర్పాటు

పోతంగల్, /జూలై 29/ (జనసంఘర్షణ): ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఎమ్మార్పీఎస్ పాత మండల కమిటీలను రద్దు చేసినట్లు బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జి సోంపూర్ పోచిరాం మాదిగ తెలిపారు. ఈ మేరకు బుధవారం పోతంగల్ మండల కేంద్రంలో ఆయన ఆధ్వర్యంలో ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా పోచిరాం మాదిగ మాట్లాడుతూ.. బాన్సువాడ నియోజకవర్గ పరిధిలోని ఆరు మండలాలకు నూతన ఎమ్మార్పీఎస్ మండల కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకునేందుకు ఆగస్టు 5న ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ సమావేశం రుద్రూర్ మండల కేంద్రంలోని శశిరేఖ గార్డెన్ వేదికగా జరగనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మార్పీఎస్ నిజామాబాద్ జిల్లా ఇన్‌చార్జి మాసాయిపేట యాదగిరి ముఖ్య అతిథిగా హాజరవుతారని పేర్కొన్నారు. ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి నూతన మండల కమిటీల ఎన్నిక కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పోచిరాం మాదిగ పిలుపునిచ్చారు. నూతన కమిటీల ఏర్పాటుతో ఎమ్మార్పీఎస్‌ను గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేసి, సామాజిక ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి కార్యకర్త సమన్వయంతో పనిచేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




## ఘనంగా సంతు శ్రీ రామరావ్ మహారాజ్ 91వ జయంతి వేడుకలు

కోటగిరి/, జూలై 29/ (జనసంఘర్షణ):




కోటగిరి మండలంలోని దేవునిగుట్ట తండాలో సంతు శ్రీ రామరావ్ మహారాజ్ 91వ జయంతి వేడుకలను బంజారా సంప్రదాయాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలతో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, భోగ్ భండార్ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సంతు సేవాలాల్ మహారాజ్ వంశంలోని రామావత్ గోత్రానికి చెందిన ఏడవ తరం వారసుడిగా పేరొందిన సంతు శ్రీ రామరావ్ మహారాజ్ మహారాష్ట్రలోని పౌరాదేవి క్షేత్రం పరిసర ప్రాంతాల నుంచి వివిధ తండాల్లో పర్యటిస్తూ బంజారా సమాజంలో మూఢనమ్మకాల నిర్మూలన, విద్యా వ్యాప్తి, సామాజిక చైతన్యం కోసం జీవితాంతం కృషి చేశారని నిర్వాహకులు తెలిపారు. ప్రతి తండాలోలిగుడి-బడి' ఉండాలని, యువత విద్యావంతులై సద్గురు మార్గంలో నడవాలని ఆయన సూచించేవారని పేర్కొన్నారు. సమాజ అభివృద్ధి కోసం భూదాన కార్యక్రమాలకు కూడా ఆయన ప్రాధాన్యత ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షులు సీతారాం నాయక్, ఆలయ కమిటీ చైర్మన్ తాండకార బారి దేవుల మెగావత్ పుండలిక్, గుడి పూజారి రూప్‌సింగ్, ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం మండల అధ్యక్షులు ఫకీరా నాయక్, సేవాలాల్ సేన అధ్యక్షులు తారాసింగ్, ఉపాధ్యక్షులు రామ్ కిషన్ కితావత్, సురేష్ గుగుల్, సురేష్, వర్త్యా తారాసింగ్, కుద్ర విట్టల్, శంకర్, యశ్వంత్‌తో పాటు తండా ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రామాయంపేట పట్టణం, మండలంలో కొత్త పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేయాలి

- **భారతీయ జనతా పార్టీ డిమాండ్.**

**ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూలై 22(జన సంఘర్షణ)**



రామాయంపేట పట్టణం, మండలంలో ఇటీవల నిర్వహించిన ఎస్ఐఆర్ (ఎస్ ఐ యర్) ప్రక్రియలో గుర్తించిన సమస్యలను దృష్టిలో ఉంచుకొని, రామాయంపేట మున్సిపాలిటీలోని బూత్ నంబర్లు 76, 77 అలాగే రామాయంపేట మండలంలోని వెంకటాపూర్ (ఆర్) గ్రామం బూత్ నంబర్ 115ను వెంటనే రేషనలైజేషన్ చేసి కొత్త పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేయాలని భారతీయ జనతా పార్టీ డిమాండ్ చేసింది. రామాయంపేట మున్సిపాలిటీలోని బూత్ నంబర్లు 76, 77లో సుమారు 1,300 మంది ఓటర్లు ఉండటంతో పోలింగ్ సమయంలో ఓటర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పోలింగ్ కేంద్రంలో తగిన వసతి లేకపోవడం, ఓటింగ్ ప్రక్రియ పూర్తవడానికి ఎక్కువ సమయం పట్టడం వల్ల ప్రజలు అసౌకర్యానికిగురవుతున్నారు. అందువల్ల ఈ రెండు బూత్‌లను రేషనలైజేషన్ చేసి అదనపు పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేయాలని కోరారు. అదేవిధంగా రామాయంపేట మండలంలోని వెంకటాపూర్ (ఆర్) గ్రామంలో బూత్ నంబర్ 115 ఒక్కటే ఉండటంతో గ్రామ ప్రజలందరూ ఒకే కేంద్రంలో ఓటు వేయాల్సి వస్తోంది. దీంతో ప్రతి ఎన్నికల్లో భారీ రద్దీ ఏర్పడి ఓటర్లు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే కొత్త పోలింగ్ బూత్‌ను మంజూరు చేయాలని భారతీయ జనతా పార్టీ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు రామాయంపేట పట్టణ ప్రధాన కార్యదర్శి ప్రవీణ్, మండల ప్రధాన కార్యదర్శి దిలీప్ ఆధ్వర్యంలో రామాయంపేట ఎమ్మార్వోకి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ శంకర్ గౌడ్, అక్కన్నపేట సర్పంచ్ యాదగిరి, దంతపల్లి సర్పంచ్ బాలరాజ్, భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రాగి రాములు, భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చింతల శేఖర్, ఓబీసీ మోర్చా జిల్లా నాయకులు నవత్ రాజేంద్రప్రసాద్,రామాయంపేట మండల ప్రభారి రంజిత్ రెడ్డి, పట్టణ ప్రభారి గడ్డం కాశీనాథ్, అక్కన్నపేట మాజీ సర్పంచ్ వెలుముల సిద్ధరాములు, పట్టణ సీనియర్ నాయకులు రమణ, బీజేవైఎం మండల అధ్యక్షులు కన్నయ్య, నాయకులు నాగరాజు, వెంకటి, నితిన్, సంతోష్, బాసం అనిల్ తదితరులు పాల్గొన్నారు. భారతీయ జనతా పార్టీ ప్రజలకు సౌకర్యవంతమైన, పారదర్శకమైన ఎన్నికల నిర్వహణ కోసం అవసరమైన చోట కొత్త పోలింగ్ బూత్‌ల ఏర్పాటు విషయంలో ఎన్నికల సంఘం తక్షణమే సానుకూల నిర్ణయం తీసుకోవాలని ఈ సందర్భంగా డిమాండ్ చేసింది.

## బీఆర్ఎస్ కౌన్సిలర్ల వార్డులపై వివక్ష ఎందుకు?

- **ఎనిమిది వార్డుల్లో అభివృద్ధి పనులు చేపట్టాలి.**
- **సమస్యలు పరిష్కరించకుంటే ప్రజల పక్షాన పోరాటం.**
- **కలెక్టర్ ప్రతిమాసింగ్‌కు వినతిపత్రం సమర్పించిన మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్‌రెడ్డి.**

**ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూలై 22 (జన సంఘర్షణ)**



మెదక్ పట్టణ అభివృద్ధిలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన కౌన్సిలర్లు ప్రాతినిధ్యం వహిస్తున్న ఎనిమిది వార్డులపై వివక్ష చూపుతున్నారని మాజీ డిప్యూటీ స్పీకర్ ఎం. పద్మా దేవేందర్‌రెడ్డి ఆరోపించారు. ఈ విషయమై బుధవారం బీఆర్ఎస్ కౌన్సిలర్లతో కలిసి జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్‌కు వినతిపత్రం సమర్పించారు. బీఆర్ఎస్ కౌన్సిలర్ల వార్డుల్లో అభివృద్ధి పనులు చేపట్టకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ అంశంపై కలెక్టర్ సానుకూలంగా స్పందించారని తెలిపారు.ఈ సందర్భంగా పద్మాదేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ..ప్రజల చేత ఎన్నికైన బీఆర్ఎస్ కౌన్సిలర్లు ప్రాతినిధ్యం వహిస్తున్న వార్డుల్లో కేవలం రాజకీయ కారణాలతో అభివృద్ధి పనులు చేపట్టడం లేదని ఆరోపించారు. మున్సిపల్ చైర్‌పర్సన్, కమిషనర్ ఎనిమిది వార్డుల్లో పనులు చేయడం లేదని, అధికారులకు కూడా పనులు చేపట్టవద్దని ఆదేశాలు ఇచ్చినట్లు తెలుస్తోందని పేర్కొన్నారు. ఈ తీరును తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు.రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల నుంచి వచ్చిన నిధులతో మెదక్ పట్టణంలోని అన్ని వార్డుల్లో సమానంగా అభివృద్ధి పనులు చేపట్టాల్సి ఉండగా, బీఆర్ఎస్ కౌన్సిలర్లు ప్రాతినిధ్యం వహిస్తున్న ఎనిమిది వార్డుల్లో మాత్రం వివక్ష చూపుతున్నారని ఆరోపించారు. టెండర్లు పూర్తయినప్పటికీ శిలాఫలకాలు ఏర్పాటు చేయడం లేదని, పనులను ప్రారంభించడం లేదని అన్నారు. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే ప్రజల పక్షాన పోరాటం చేస్తామని హెచ్చరించారు.ఎనిమిది వార్డుల్లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించాల్సిన బాధ్యత మున్సిపల్ చైర్‌పర్సన్, కమిషనర్,ఎమ్మెల్యేపై ఉందని పేర్కొన్నారు.రాజకీయాలకు అతీతంగా అన్ని వార్డులకు సమానంగా అభివృద్ధి పనులు కేటాయించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కమిషనర్ వెంటనే స్పందించి బీఆర్ఎస్ కౌన్సిలర్లు ప్రాతినిధ్యం వహిస్తున్న 8 వార్డుల్లో పర్యటించి సమస్యలను గుర్తించి పరిష్కరించాలని కోరారు. అనంతరం బీఆర్ఎస్ పార్టీ పట్టణ కన్వీనర్, కౌన్సిలర్ మామిళ్ల ఆంజనేయులు మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ నుంచి గెలుపొందిన ఎనిమిది మంది కౌన్సిలర్లపై వివక్ష చూపుతున్నారని ఆరోపించారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల నుంచి వచ్చిన నిధులతో వీధి దీపాలు, డ్రైనేజీలు, రహదారుల నిర్మాణం వంటి పనులు అన్ని వార్డుల్లో చేపట్టాల్సి ఉన్నప్పటికీ, తమ వార్డుల్లో పనులు జరగడం లేదని అన్నారు.టెండర్లు పూర్తయి రెండు, మూడు నెలలు గడుస్తున్నప్పటికీ శిలాఫలకాలు ఏర్పాటు చేయడం లేదని, పనులను ప్రారంభించడం లేదని పేర్కొన్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే పట్టణ అభివృద్ధి దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. తమ వార్డుల్లో నివసిస్తున్న ప్రజలు కూడా మున్సిపాలిటీకి పన్నులు చెల్లిస్తున్నారని, వారికి మౌలిక వసతులు కల్పించాల్సిన బాధ్యత మున్సిపాలిటీపై ఉందని గుర్తు చేశారు. ఎనిమిది వార్డుల్లో వెంటనే అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు మౌలిక వసతులు కల్పించాలని మున్సిపల్ కమిషనర్‌ను డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.రాజకీయాలకు అతీతంగా అన్ని వార్డులను సమానంగా చూసి అభివృద్ధి పనులు చేపట్టాలని కోరారు. ఇతర కౌన్సిలర్లు మాట్లాడుతూ తమ వార్డుల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు మున్సిపల్ కమిషనర్ స్వయంగా పర్యటించాలని డిమాండ్ చేశారు. ప్రజల చేత ఎన్నికైన ప్రజాప్రతినిధులుగా తమ వార్డుల్లో మౌలిక వసతులు కల్పించాలని కోరుతున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు జుబెర్ అహ్మద్,ఖాజా సోహెల్ మైనుద్దీన్, బట్టిఉదయ్‌కుమార్, దీపక్‌కుమార్, మాయ, గంగామణి, మల్లేశం, స్వరూప, ఫాతిమా ఇమ్దాద్ అలీ, తదితరులు పాల్గొన్నారు.

# పేద విద్యార్థినుల చదువుకు రోటరీ సంస్థల చేయూత

- **బోధన్‌లో 325 మంది బాలికలకు ఉచిత సైకిళ్ల పంపిణీ..**
- **నలుగురికి ఆదర్శంగా నిలిచిన సేవా కార్యక్రమం**

**బోధన్ ప్రతినిధి/జూలై 29/(జన సంఘర్షణ):**

గ్రామీణ ప్రాంతాల్లోని పేద విద్యార్థినులు పాఠశాలలకు సులభంగా చేరుకుని తమ చదువును కొనసాగించాలనే లక్ష్యంతో రోటరీ సంస్థలు ముందుకు వచ్చాయి. ఇందులో భాగంగా బోధన్ పట్టణంలోని శ్రీ మహాలక్ష్మి ఫంక్షన్ హాల్‌లో బుధవారం 325 మంది అర్హులైన పేద విద్యార్థినులకు ఉచిత సైకిళ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ సలహాదారు, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి విద్యార్థినులకు సైకిళ్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ.. పేద విద్యార్థినుల చదువుకు రోటరీ క్లబ్ అందిస్తున్న చేయూత అభినందనీయమని అన్నారు. విద్యార్థినులకు సైకిళ్లు అందించడం ద్వారా వారి ప్రయాణ భారం తగ్గడంతో పాటు, విద్యను కొనసాగించేందుకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. సమాజ అభివృద్ధిలో స్వచ్ఛంద సంస్థలు, సేవా సంస్థలు ప్రభుత్వంతో కలిసి పనిచేస్తే మరిన్ని మంచి ఫలితాలు సాధించవచ్చని పేర్కొన్నారు. "ఒక సైకిల్.. ఒక విద్యార్థినికి ప్రయాణ సౌకర్యం మాత్రమే కాదు, ఆమె భవిష్యత్తు వైపు వేసే ఒక ముందడుగు" అని చెప్పేలా ఈ కార్యక్రమం నిలిచింది. పేద కుటుంబాలకు చెందిన బాలికల విద్యకు అండగా నిలుస్తూ రోటరీ సంస్థలు చేపట్టిన ఈ సేవా కార్యక్రమం పలువురికి స్ఫూర్తిదాయకంగా మారింది. ఈ కార్యక్రమానికి రోటరీ ట్రస్ట్ ఆఫ్ లేక్ డిస్ట్రిక్ట్ మొయినాబాద్, రోటరీ క్లబ్ ఆఫ్ లేక్ డిస్ట్రిక్ట్ మొయినాబాద్ సహకారం అందించగా, రోటరీ క్లబ్ ఆఫ్ జెమ్స్ నిజామాబాద్ మరియు రోటరీ క్లబ్ ఆఫ్ బోధన్ సంయుక్తంగా కార్యక్రమాన్ని నిర్వహించాయి. ఈ సందర్భంగా రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఆర్‌టీఎన్ ఉదయ్ సుధీర్ పిలానీ, బోధన్ రోటరీ క్లబ్ సభ్యులు విద్యాసాగర్, అల్ల రమేష్, కళ్యాణ్, శివ తదితరులు పాల్గొన్నారు.



**సేవే స్ఫూర్తి.. విద్యే లక్ష్యం....**

పేద విద్యార్థినుల విద్యాభ్యాసానికి అండగా నిలిచే ఇలాంటి కార్యక్రమాలు సమాజంలోని ప్రతి ఒక్కరికీ ఆదర్శంగా నిలుస్తాయి. ఆర్థిక స్థోమత లేని విద్యార్థులకు తమ వంతు సహాయం అందించడం ద్వారా వారి జీవితాల్లో మార్పు తీసుకురావచ్చని ఈ కార్యక్రమం చాటిచెప్పింది. పేద పిల్లల చదువుకు చేయూతనిచ్చే ప్రతి సేవా కార్యక్రమం సమాజ భవిష్యత్తును బలోపేతం చేస్తుందని పలువురు అభిప్రాయపడ్డారు.

## అంగన్‌వాడీ పోస్టులకు భారీ స్పందన

- **కొల్చారం,పాపన్నపేట మండలాల్లో 186 దరఖాస్తులు.**
- **102 మంది సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కు హాజరు.**

**ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూలై 22 (జన సంఘర్షణ)**



మెదక్ పట్టణంలోని సిడిపిఓ కార్యాలయంలో ఖాళీగా ఉన్న అంగన్ వాడీ పోస్టులకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ నిర్వహించినట్లు మెదక్ సీడీపీఓ వెంకటరమణమ్మ తెలిపారు. మెదక్ ప్రాజెక్టు పరిధిలోని కొల్చారం, పాపన్నపేట మండలాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ టీచర్ పోస్టుల భర్తీ ప్రక్రియలో భాగంగా నిర్వహించిన వెరిఫికేషన్ కు అభ్యర్థుల నుంచి మంచి స్పందన లభించింది. మొత్తం 5 పోస్టులకు 186 మంది దరఖాస్తు చేయగా, 102 మంది వెరిఫికేషన్‌కు హాజరైనట్లు సీడీపీఓ తెలిపారు.కొల్చారం మండలంలోని 2 పోస్టులకు 74 మంది దరఖాస్తు చేసుకోగా, 38 మంది హాజరయ్యారు. పాపన్నపేట మండలంలోని 3 పోస్టులకు 112 మంది దరఖాస్తు చేయగా, 64 మంది వెరిఫికేషన్ కు హాజరయ్యారు.భర్తీ జరుగుతున్న ఖాళీల్లో కొల్చారం మండలంలోని రంగంపేట-2, కొంగోడ్ సెంటర్-2, పాపన్నపేట మండలంలోని కొత్తపల్లి సెంటర్-2, అర్కెల సెంటర్-2, లక్ష్మీనగర్ తండా అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయని సీడీపీఓ వెంకట రమణమ్మ వెల్లడించారు.

## పి.వి శ్రీ రమణ తండ్రి స్వర్గీయ పరిమి వెంకయ్య దశదినకర్మ కార్యక్రమం

- **ఘనంగా నివాళులు అర్పించిన తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు కట్టెల మల్లేశం, కూకట్పల్లి అధ్యక్షులు ఎర్ర యాకయ్య.**

**హైదరాబాద్ సిటీ, కూకట్పల్లి ప్రతినిధి అంజిబాబు, జూలై 29, (జన సంఘర్షణ):**



కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలోని కేపీహెచ్‌బీ కాలనీ రోడ్ నెంబర్ మూడులో నివాసముంటున్న పీ వి శ్రీ రమణ తండ్రి స్వర్గీయ పరిమి వెంకయ్య దశదినకర్మ కార్యక్రమం బుధవారం కుటుంబ సభ్యులు, బంధు మిత్రుల సమక్షంలో నిర్వహించబడింది. స్వర్గీయ పరిమి వెంకయ్య చిత్రపటానికి తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు కట్టెల మల్లేశం, ఉపాధ్యక్షులు వంగాల కొండల్ రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మహేందర్, కూకట్పల్లి అధ్యక్షులు ఎర్ర యాకయ్య, పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం వెంకయ్య ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థించి, కుటుంబ సభ్యులను పరామర్శిస్తూ వారికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ కూకట్పల్లి జనరల్ సెక్రటరీ నాగుల అంజిబాబు, ఆర్గనైజింగ్ సెక్రటరీ నాగార్జున, ఈసీ మెంబర్ సుజాత, అనిల్ కిషోర్, శివ, రామకృష్ణ, బి. శ్రీధర్, జి. శ్రీధర్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# లైన్స్ క్లబ్ కంటి ఆస్పత్రికి రూ.10 లక్షల విరాళం

- **పేదలకు మెరుగైన నేత్ర వైద్య సేవలే లక్ష్యం..**
- **మరింత మంది దాతలు ముందుకు రావాలి**

**బోధన్, జూలై 29 (జన సంఘర్షణ):**

పేదలకు నాణ్యమైన నేత్ర వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో బోధన్‌లో నిర్వహిస్తున్న లైన్స్ క్లబ్ కంటి ఆస్పత్రి అభివృద్ధికి అమెరికాలో నివసిస్తున్న ప్రముఖ ఎన్నారై డాక్టర్ రవీందర్ రెడ్డి మరోసారి తన ఉదారతను చాటుకున్నారు. ఆస్పత్రి అభివృద్ధి, పేద రోగులకు ఉచితంగా మెరుగైన నేత్ర వైద్య సేవలు అందించేందుకు తన వంతు సహాయంగా రూ.10 లక్షల విరాళాన్ని అందజేశారు. మంగళవారం డాక్టర్ రవీందర్ రెడ్డి తరఫున ఆయన బంధువు ప్రభు రెడ్డి విరాళానికి సంబంధించిన చెక్కును లైన్స్ ట్రస్ట్ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ సభ్యులు మాట్లాడుతూ.. డాక్టర్ రవీందర్ రెడ్డి గతంలో కూడా ఆస్పత్రి అభివృద్ధికి, పేద రోగులకు వైద్య సేవలు అందించేందుకు పలుమార్లు ఆర్థిక సహాయం అందించారని గుర్తుచేశారు. ఇటీవల ఆస్పత్రిని



సందర్శించిన డాక్టర్ రవీందర్ రెడ్డి.. అక్కడి పారిశుధ్య నిర్వహణతో పాటు అత్యాధునిక వైద్య పరికరాలతో పేదలకు అందిస్తున్న ఉచిత నేత్ర వైద్య సేవలు, శస్త్రచికిత్సలను అభినందించినట్లు తెలిపారు. భవిష్యత్తులోనూ ఆస్పత్రి అభివృద్ధికి తనవంతు సహకారం కొనసాగిస్తానని ఆయన హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు.

**ఒకరి సేవ మరొకరికి స్ఫూర్తి కావాలి....**

పేదల కంటి వెలుగుకు అండగా నిలుస్తున్న లైన్స్ క్లబ్ కంటి ఆస్పత్రికి డాక్టర్ రవీందర్ రెడ్డి అందించిన రూ.10 లక్షల విరాళం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. ఆయన సేవాభావం మరెందరో దాతలకు స్ఫూర్తిగా నిలవాలని, సమాజంలో ఆర్థికంగా స్థోమత ఉన్న వారు కూడా ముందుకు వచ్చి ఆస్పత్రి అభివృద్ధికి తమవంతు సహకారం అందించాలని లైన్స్ ట్రస్ట్ సభ్యులు విజ్ఞప్తి చేశారు. దాతల సహకారం మరింత పెరిగితే పేదలకు మెరుగైన, ఉచిత నేత్ర వైద్య సేవలను విస్తృతంగా అందించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. రూ.10 లక్షల ఉదార విరాళం అందించిన డాక్టర్ రవీందర్ రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులకు లైన్స్ ట్రస్ట్ సభ్యులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లైన్స్ మేనేజింగ్ ట్రస్టీ పి. బసవేశ్వరరావు, లైన్స్ ఐ ఆస్పత్రి చైర్మన్ నరసింహారెడ్డి, సభ్యులు ఉమేష్ శిండే, ప్రభు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## భారీ వర్షాలకు మెదక్‌కు మున్సిపాలిటీ నుండి డిజాస్టర్ టాస్క్ ఫోర్స్ టీం ఏర్పాటు

**ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూలై 22 (జన సంఘర్షణ)**

ప్రస్తుత వర్షాకాలంలో గత మూడు రోజులుగా వర్షాలు ఎడతెరిపి లేకుండా కురుస్తున్నందున పట్టణ ప్రజలు ఇబ్బందులు పడకుండ అత్యవసర సేవలు అందించేందుకు మెదక్ పురపాలక సంఘం నుండి డిజాస్టర్ టాస్క్ ఫోర్స్ టీం ను ఏర్పాటు చేయడం జరిగింది. ఇందులో అకాల వర్షాల వలన మంచినీటి సరఫరాలో కాలుష్యం జరగకుండ, ఈదురు గాలులు వచ్చినప్పుడు ఎలక్ట్రికల్ వైర్లు రోడ్డుపై పడితే వాటిని వెంటనే తీయించేందుకు ఇతర అత్యవసర సేవలకు మున్సిపల్ సత్యనారాయణ మున్సిపల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ 9154293336ని జె నితిన్ మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్ 6303678200 ని నియమించడం జరిగింది. అంతేకాకుండా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల వలన పట్టణంలో కూలిపోయే స్థితిలో ఉన్న ఇండ్లను గుర్తించి, సదరు ఇంటి వారిని పట్టణంలోని వార్డ్ నెంబర్ 12 లో గల అర్బన్ హోమ్ లెస్ సెంటర్కు తరలించి ప్రాణం శిథిలావస్థలో ఉన్న ఇండ్లను కూల్చివేయుట గురించి ప్రవీణ్ కుమార్ టౌన్ ప్లానింగ్ అధికారి 9705555481ని ప్రభాకర్ టౌన్ ప్లానింగ్ సూపర్వైజర్ 9951728298 ని నియమించడం జరిగింది. వర్షాల వలన మురికి కాలువలు బ్లాక్ అయ్యి వర్షపు నీరు రోడ్డుపై ప్రవహించుటను అధిగమించడానికి మురికి కాలువలను శుభ్రం చేయుటకు, లోతట్టు ప్రాంతాలలో నిలిచిన వర్షపు నీరును తొలగించుటకు, ఈదురు గాలులు వీచినపుడు చెట్లు రోడ్లపై పడిన యెడల వాటిని తొలగించుటకు ఇతర అత్యవసర సేవలకు నాగరాజు ఇన్చార్జి సానిటరీ ఇన్స్పెక్టర్ 9701828617 ని నియమించడం జరిగింది. అంతేకాకుండా, పట్టణ ప్రజల సౌకర్యార్థం మెదక్ మున్సిపాలిలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి దానికి మణిచరణ్ గౌడ్ ని కంట్రోల్ రూమ్ ఇన్చార్జిగా నియమించడం జరిగింది. మెదక్ పట్టణ ప్రజలు వర్షాకాలంలో అన్ని అత్యవసర సేవలకు సెల్ నెంబర్ 9154293346 నెంబర్ కు ఫోన్ చేసి వారి సమస్యను తెలియపరచిన యెడల పైన తెలిపిన సంబంధిత అధికారి మరియు వారి సిబ్బంది ద్వారా మీ సమస్యను తీర్చబడుతుంది. కావున పట్టణ ప్రజలు వర్షాల వలన కలిగే సమస్యలను తెలపడానికి మెదక్ మున్సిపల్ కంట్రోల్ రూమ్ నెంబర్ 9154293346 కు ఫోన్ చేసి మున్సిపాలిటీ నుండి అత్యవసర సేవలు పొందగలరని కోరునైనది.

# గాల్లో డ్రైవింగ్... గాడి తప్పుతున్న యువత!

- కఠిన చర్యలు తప్పవని కారేపల్లి సీఐ నునావత్ సాగర్ హెచ్చరిక

సింగరేణి ప్రతినిధి: (జన సంఘర్షణ) న్యూస్

నేటి సమాజంలో మైనర్ల డ్రైవింగ్ ఆందోళనకర స్థాయికి చేరుకుందని, నిర్లక్ష్యంగా వాహనాలు నడుపుతూ యువత తమ బంగారు భవిష్యత్తును బూడిద చేసుకుంటున్నారని కారేపల్లి సీఐ నునావత్ సాగర్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. 'రయ్... రయ్' మంటూ ద్విచక్ర వాహనాలపై పరిమితికి మించిన వేగంతో దూసుకుపోతున్న మైనర్ల తీరుతో గ్రామాల్లో, ప్రధాన రహదారులపై కాలినడకన వెళ్లే ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారని పేర్కొన్నారు.

**తల్లిదండ్రుల గారాబమే ప్రాణగండం!**

పిల్లలు అడిగారని, స్నేహితుల్లో తమ బిడ్డ తక్కువ కాకూడదని ఆలోచించి వాహనాలు కొనివ్వడం లేదా చేతికి ఇవ్వడం తల్లిదండ్రులు చేస్తున్న పెద్ద పొరపాటని సీఐ తెలిపారు. క్షణిక ఆనందం కోసం ఇచ్చే ఆ వాహనమే భవిష్యత్తులో తీరని శోకాన్ని మిగిల్చే ప్రమాదముందని హెచ్చరించారు. పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే వయసులోనే లైసెన్స్ లేకుండా బైకులు నడపడం పరిపాటిగా మారిందని, పిల్లల కదలికలపై నిరంతరం తల్లిదండ్రుల పర్యవేక్షణ ఉండాలని సూచించారు.

**గంజాయి కిక్కు.. రీల్స్ పిచ్చి.. ప్రాణాల మీదికి తెస్తున్న స్టంట్లు!**

కొందరు యువకులు గంజాయి వంటి చెడు అలవాట్లకు బానిసలై రహదారులపై 'రాష్ కటింగ్స్', ప్రమాదకర స్టంట్లు చేస్తూ సామాజిక మాధ్యమాల్లో (రీల్స్) పోస్టు చేయడానికి ఆరాటపడుతున్నారని సీఐ మండిపడ్డారు. గాల్లో తేలిపోతున్నామనే భ్రమలో డ్రైవింగ్ చేస్తూ తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా ముప్పులోకి నెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటువంటి అక్రమ, ప్రమాదకర చర్యలపై పోలీసు శాఖ ప్రత్యేక నిఘా ఉంచిందని స్పష్టం చేశారు.

**చట్టం ఏం చెబుతోంది?**

వయోపరిమితి : 18 సంవత్సరాలు నిండి, చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్ ఉన్నవారు మాత్రమే వాహనాలు నడపాలి.

భారీ జరిమానా: మైనర్లకు వాహనాలు ఇచ్చినా,




నడపడానికి అనుమతించినా సదరు వాహన యజమానులు/తల్లిదండ్రులపై కేసులు నమోదు చేసి రూ. 25,000 వరకు జరిమానా విధించడంతో పాటు వాహనాన్ని జప్తు చేయడం జరుగుతుంది.

కఠిన కేసులు: ర్యాష్ డ్రైవింగ్, గంజాయి సేవించి వాహనాలు నడిపే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని సీఐ తెలిపారు.

తల్లిదండ్రులు బాధ్యతాయుతంగా వ్యవహరించి తమ పిల్లల భవిష్యత్తును, ప్రాణాలను కాపాడుకోవాలని, మైనర్లకు ఎట్టి పరిస్థితుల్లోనూ వాహనాలు ఇవ్వవద్దని సీఐ నునావత్ సాగర్ విజ్ఞప్తి చేశారు.

# ప్రజా సంక్షేమంలో రాజీలేదు

- సమస్య ఏదైనా పరిష్కార మార్గాన్ని ఆలోచిస్తా
- మాధరాశీ సర్పంచ్ ఉమా నరేష్
- సర్పంచ్ చొరవతో దాతల సాయంతో మాదారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఫ్రిడ్జ్ ఏర్పాటు
- ప్రమాదం జరిగితే (కుక్క కాటు పాము కాటు తేలు కాటు) వ్యాక్సిన్ అందుబాటులో లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు
- 20వేల రూపాయల ఫ్రిజ్ను అందజేసిన దాత కిలారీ వెంకటేశ్వరరావు దంపతులు
- సర్పంచ్, దాతని సన్మానించిన ఆసుపత్రి సిబ్బంది

జూలై 29 (జనసంఘర్షణ):

ఫ్రిడ్జ్ ఏర్పాటుతో అన్ని రకాల వ్యాక్సిన్ అందుబాటులో ఉంటాయని గ్రామ పెద్దలు గర్భిణీ స్త్రీలు రైతులు యువకులు సర్పంచ్ ఉన్నంతమైన ఆలోచన విధానాన్ని ప్రశంసలతో అభినందించారు. ప్రతి ఒక్కరు గ్రామ అభివృద్ధిలో తమ యొక్క సహాయ సహకారాలు అందజేస్తూ గ్రామాన్ని అభివృద్ధిలో ముందు ఉంచాలని సర్పంచ్ కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ విజయ్, ఏఎన్ఎం పుష్ప, చందన, కిలారి వెంకటేశ్వర్లు, కాసాని లక్ష్మీనారాయణ, వార్డు మెంబర్లు అజ్మీర, శారద, అజ్మీర, రజిని, భారతి, ఆసుపత్రి సిబ్బంది






# వర్షాలకు అక్కలబస్తీ అతలాకుతలం

- గత మూడు సంవత్సరాలుగా వర్షాకాలం బస్తిని ముంచేస్తుంది.
- వరదనీటికి బస్తీ ప్రజల తిప్పలు.
- వెంటనే అధికారులు స్పందించి పనులు చేపట్టాలి.
- బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రాగి రాములు.

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూలై 22 (జన సంఘర్షణ)

మెదక్ జిల్లా రామాయంపేట మున్సిపాలిటీ పట్టణంలోని అక్కలబస్తీని వరద ముంపు నుంచి వెంటనే రక్షించాలి. టెక్నికల్ లోపాలతో నిర్మించిన బ్రిడ్జి కారణంగా ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారనీ రాగి రాములు ఆవేదన వ్యక్తం చేశారు.పట్టణంలోని 11వ వార్డు అక్కలబస్తీలో గత రెండేళ్లుగా ప్రజలు అత్యంత దయనీయ పరిస్థితుల్లో జీవనం సాగిస్తున్నారని వర్షాకాలం వస్తే ప్రతి ఇంటిలోకి వరద నీరు చేరి ప్రజల ప్రాణాలు,ఆస్తులు ప్రమాదంలో పడుతున్నాయని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు, మెదక్ జిల్లా నాయకుడు రాగి రాములు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గత సంవత్సరం కురిసిన భారీ వర్షాలకు అక్కలబస్తీలోని దాదాపు అన్ని ఇళ్లలోకి వరద నీరు చేరి ప్రజలకు తీవ్ర నష్టం వాటిల్లిందని తెలిపారు.ఈ సమస్యపై బస్తీ ప్రజలు అనేకసార్లు మున్సిపల్ అధికారులను, ప్రజాప్రతినిధులను కలిసి వినతిపత్రాలు సమర్పించినప్పటికీ,ఇప్పటి వరకు శాశ్వత పరిష్కారం చూపకపోవడం అధికార యంత్రాంగం నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. అక్కలబస్తీ నుంచి బయటకు వెళ్లాల్సిన వర్షపు నీటి ప్రవాహాన్ని టెక్నికల్ లోపాలతో నిర్మించిన బ్రిడ్జి అడ్డుకుంటోందని, ఫలితంగా నీరు బయటకు వెళ్లే మార్గం లేక మొత్తం బస్తీ చెరువును తలపించేలా మారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు వెంటనే సాంకేతిక లోపాలను సరిదిద్ది, నీరు నిరంతరంగా బయటకు వెళ్లే విధంగా శాశ్వత డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. గత ఏడాది భారీ వర్షాల సమయంలో అక్కలబస్తీ ప్రజలు అనుభవించిన మనోవేదనను ఒక్కసారి గుర్తు చేసుకుని అయినా అధికారులు స్పందించాలని కోరారు. ప్రతి వర్షాకాలంలో ప్రజలు భయాందోళనల మధ్య జీవించడం అత్యంత దురదృష్టకరమని అన్నారు. రామాయంపేటలో అక్కలబస్తీ అంటేనే అవస్థల బస్తీ అనే పరిస్థితి



ఏర్పడిందని, అక్కడి ప్రజల గోడు వినే నాథుడే లేకపోవడం బాధాకరమని రాగి రాములు విమర్శించారు. కనీసం మౌలిక సదుపాయాలు కూడా లేని పరిస్థితిలో ప్రజలు జీవిస్తున్నారని, వర్షం కురిస్తే ఇళ్లలో నీరు నిలిచి చిన్నపిల్లలు, వృద్ధులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అధికారులు ఇప్పటికైనా నిర్లక్ష్య వైఖరిని వీడి అక్కలబస్తీ సమస్యను అత్యవసరంగా పరిగణించి, టెక్నికల్ లోపాలతో నిర్మించిన బ్రిడ్జిని సరిచేసి, శాశ్వత డ్రైనేజీ పరిష్కారం అమలు చేయాలని భారతీయ జనతా పార్టీ తరపున డిమాండ్ చేస్తున్నామని చెప్పారు. అలాగే ఈ సమస్యపై తక్షణమే చర్యలు తీసుకోకపోతే అక్కలబస్తీ ప్రజలతో కలిసి భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపట్టేందుకు వెనుకాడబోమని రాగి రాములు హెచ్చరించారు.

# సూర్యవంశ అరెకటికె సంఘం బోనాల మహోత్సవానికి కంఠరెడ్డి తిరుపతిరెడ్డి రాక

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూలై 22 (జన సంఘర్షణ)

మెదక్ పట్టణంలోని సూర్యవంశ అరెకటికె సంఘం ఆధ్వర్యంలో ఆగస్టు 4న నిర్వహించనున్న శ్రీ నల్ల పోచమ్మ-ముత్యాలమ్మ బోనాల మహోత్సవానికి బీఆర్ఎస్ జిల్లా నాయకులు కంఠరెడ్డి.తిరుపతిరెడ్డిని అరేకటికే సంఘం సభ్యులు బుధవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా బోనాల మహోత్సవానికి విచ్చేసి అమ్మవారి ఆశీర్వాదాలు పొందాలని, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో పట్టణ నాయకులు, చంద్రమోహన్ గౌడ్, కిరణ్ గౌడ్, కసిరెడ్డి మాణిక్యం రెడ్డి, సంగు స్వామి, కౌన్సిలర్ గౌస్, అరేకటికే సంఘం సభ్యులు ధర్మాకర్ బన్సీలాల్, ధర్మాకర్ శ్రీనివాస్, ధర్మాకర్ సజన్‌లాల్, ధర్మాకర్ నర్సోజి, ధర్మాకర్ సతీష్, ధర్మాకర్ శివాజీ, ధర్మాకర్ గోవింద్, ధర్మాకర్ ప్రవీణ్, ధర్మాకర్ సందీప్, ధర్మాకర్ కన్నయ్య, ధర్మాకర్ శ్రీకాంత్, ధర్మాకర్ క్రాంతి, బన్నీ తదితరులు పాల్గొన్నారు.



# రైతుల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా రోడ్డు పనులు ప్రారంభం

- సమస్యను గుర్తించి వెంటనే స్పందించిన సర్పంచ్ కల్లూరు సంధ్య బజరంగ్

పోతంగల్, జూలై 29 (జనసంఘర్షణ):



ఇటీవల కురిసిన వర్షాలకు పోతంగల్ మండల కేంద్రంలోని రైతులు తమ పొలాలకు వెళ్లే రహదారి బురదమయంగా మారి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షపు నీరు నిలిచిపోవడంతో రైతులు వ్యవసాయ పనుల కోసం పొలాలకు వెళ్లేందుకు నానా అవస్థలు పడుతున్న పరిస్థితి నెలకొంది. ఈ సమస్యను రైతులు గ్రామ సర్పంచ్ కల్లూరు సంధ్య, బజరంగ్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన వెంటనే స్పందించారు. రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని రహదారి మార్గాన్ని సరిచేసే పనులను స్వయంగా ప్రారంభించారు. రైతులకు రాకపోకలు సులభతరం అయ్యేలా రోడ్డు మరమ్మతు పనులను వేగంగా చేపట్టారు. రైతుల సమస్యను గుర్తించి ఆలస్యం చేయకుండా వెంటనే రోడ్డు పనులు ప్రారంభించడంపై రైతులు సంతోషం వ్యక్తం చేశారు. తమ ఇబ్బందులను అర్థం చేసుకుని స్పందించిన సర్పంచ్ కల్లూరు సంధ్య, బజరంగ్‌కు రైతులు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించి తక్షణమే స్పందిస్తూ అభివృద్ధి పనులు చేపట్టడం అభినందనీయమని వారు పేర్కొన్నారు.

# మెదక్ ప్రెస్ క్లబ్ అధ్యక్షునిగా నరసింహ చారి భారీ మెజారిటీతో ఎన్నిక

- బుధవారం జరిగిన జర్నలిస్టుల ఎన్నికల్లో నరసింహచారి, ప్రకాష్ పై గెలుపొందారు.




ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూలై 22 (జన సంఘర్షణ)



మెదక్ ప్రెస్ క్లబ్ 2026-28 సంవత్సరానికి జరిగిన ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. స్థానిక ప్రెస్ క్లబ్ భవనంలో జరిగిన ఎన్నికల్లో 98 మంది ఓట్లకు గాను 96 మంది వినియోగం చేసుకున్నారు. ఓటర్లు బారులు తీరి ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. సీనియర్ విలేకరులు బాలేశ్వర్, దేవయ్య, శ్రీధర్, మురళి, ఫారూక్, ఖయ్యాం, హరినాథ్, బీవీకే రాజు, శంకర్ దయాల్ చారి, గోపాల్ గౌడ్ తో పాటు మున్సిపల్ వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్ ఓటు హక్కును వినియోగించు కున్నారు. హోరాహోరీగా ఎన్నికలు జరుగగా అధ్యక్ష స్థానానికి గుట్టమీది ప్రకాష్, శివన్నగారి నర్సింహచారి తలపడ్డారు. ప్రకాశ్ కు 42 ఓట్లు రాగా, నర్సింహచారికి 54 ఓట్లు వచ్చాయి.12 ఓట్ల మెజార్టీతో నర్సింహ చారి అధ్యక్షుడిగా గెలుపొందారు. ప్రధాన కార్యదర్శి పదవికి చెవిటి అశోక్, బచ్చు సంగమేశ్వర్ పోటీ పడగా, అశోక్ కు 44 ఓట్లు, సంగమేశ్వర్ కు 52 ఓట్లు వచ్చాయి.8 ఓట్ల మెజార్టీతో సంగమేశ్వర్ విజయం సాధించారు.ెగలిచిన అధ్యక్ష, కార్యదర్శులకు ఎన్నికల కమిటీ సభ్యులు మంగ శరత్ చంద్ర గౌడ్, బోనగిరి చంద్రశేఖర్, అల్లాడి శేఖర్, పొగాకు రామకృష్ణ, మహ్మద్ యూసుఫ్ ఆలీ ధ్రువపత్రాలు అందజేశారు.

# చట్టాలు కాగితాలకే... కారేపల్లిలో సిండికేట్ సామ్రాజ్యం!



సింగరేణి ప్రతినిధి: (జన సంఘర్షణ) న్యూస్




కారేపల్లి మండలంలో ఎమ్మార్పీకి మించి మద్యం విక్రయాలు జరుగుతున్నాయన్న ఆరోపణలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. వినియోగదారుల హక్కులను కాపాడాల్సిన నిబంధనలు అమలుకు నోచుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని అనేక మద్యం దుకాణాల్లో ఎమ్మార్పీ కంటే రూ.20 నుంచి రూ.50 వరకు అదనంగా వసూలు చేస్తున్నారని, బిల్లులు ఇవ్వడం లేదని ఆరోపిస్తున్నారు. మండలంలోని గ్రామాలు, తండాల వరకు ఒకే విధమైన అదనపు ధరలు అమలు చేస్తున్నారని, దీంతో సిండికేట్ తరహా వ్యవస్థ నడుస్తోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం నిర్దేశించిన ఎమ్మార్పీ ధరల పట్టికలు చాలా దుకాణాల్లో ప్రదర్శించకపోవడం, కంప్యూటర్ బిల్లులు ఇవ్వకపోవడం వల్ల వినియోగదారులు నష్టపోతున్నారని ప్రజలు చెబుతున్నారు. అదనపు వసూళ్లపై వినియోగదారులు ప్రశ్నిస్తే కొందరు నిర్వాహకులు దురుసుగా ప్రవర్తిస్తున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. ఈ వ్యవహారంపై లీగల్ మెట్రాలజీ, ఎక్సైజ్ శాఖ అధికారులు తక్షణమే తనిఖీలు నిర్వహించి, వాస్తవాలను వెలికితీయాలని ప్రజలు కోరుతున్నారు. అక్రమ వసూళ్లు నిజమే అయితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుని, ఎమ్మార్పీ ధరలకే విక్రయాలు జరిగేలా చర్యలు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. అధికారులు స్పందించి మండలంలో జరుగుతున్న ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం
తెలుగు దినపత్రిక
గురువారం
30 జులై 2026

# మెదక్ పట్టణ నూతన మాస్టర్ ప్లాన్ అమలుకు జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ చూపాలి

- **మెదక్ పట్టణ అభివృద్ధికి అత్యంత కీలకమైన నూతన మాస్టర్ ప్లాన్‌ను తక్షణమే అమలు చేయాలని మెదక్ పట్టణ టీఆర్ఎస్ కన్వీనర్,5వ వార్డు కౌన్సిలర్ మామిళ్ల ఆంజనేయులు డిమాండ్ చేశారు.**

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూలై 22 (జన సంఘర్షణ)

రాష్ట్రంలోని మున్సిపాలిటీలకు దాదాపు 40 సంవత్సరాల క్రితం రూపొందించిన పాత మాస్టర్ ప్లాన్‌ల స్థానంలో నూతన మాస్టర్ ప్లాన్‌లు రూపొందించే ప్రక్రియలో భాగంగా,గత పాలకవర్గం మెదక్ పట్టణానికి సంబంధించిన సమగ్ర సర్వేలను పూర్తి చేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిందన్నారు. అయితే రాష్ట్రవ్యాప్తంగా నెలకొన్న పరిస్థితులు, ఎన్నికల కోడ్ అమలులో ఉండటం వల్ల ఆ ప్రక్రియ నిలిచిపోయిందని తెలిపారు.ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు గడిచినా, నూతన మాస్టర్ ప్లాన్ అమలుపై ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడం వల్ల మెదక్ పట్టణ అభివృద్ధి తీవ్రంగా దెబ్బతింటోందని ఆవేదన వ్యక్తం చేశారు.మాస్టర్ ప్లాన్ లేకపోవడంతో కొత్త భవనాలకు నిర్మాణ అనుమతులు జారీ కావడం లేదని,దీంతో ప్రజలు అక్రమ నిర్మాణాల వైపు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోందన్నారు. ఫలితంగా మున్సిపాలిటీకి రావాల్సిన నిర్మాణ అనుమతి ఫీజులు, ఆస్తి పన్నులు వంటి ఆదాయం కోల్పోయి ఆర్థికంగా నష్టపోతోందని పేర్కొన్నారు. ఇప్పటికే మాస్టర్ ప్లాన్ పరిధిలో నిర్మించిన భవనాలకు బిల్డింగ్ రెగ్యులరైజేషన్ స్కీమ్ (బి ఆర్ ఎస్) ద్వారా పూర్తి స్థాయి




అనుమతులు కల్పించాలని, అలాగే మెదక్ పట్టణ నూతన మాస్టర్ ప్లాన్‌ను వెంటనే ఆమోదించి అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు .అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు ఈ అంశాన్ని అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని జిల్లా కలెక్టర్‌తో సమన్వయం చేసి మెదక్ పట్టణ నూతన మాస్టర్ ప్లాన్‌కు త్వరితగతిన ఆమోదం వచ్చేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. మెదక్ పట్టణ భవిష్యత్ అభివృద్ధి దృష్ట్యా జిల్లా కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ వహించి అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

# మెదక్ పట్టణ మున్సిపల్ చైర్మన్, కమిషనర్‌కి వినతి

- **డబుల్ బెడ్ రూమ్ కాలనీలో వీధి కుక్కల దాడులు చిన్నారికి తీవ్ర గాయాలు.**
- **మున్సిపాలిటీ అధికారులు వెంటనే పట్టించుకోవాలి**
- **కాలనీవాసుల డిమాండ్.**

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూలై 22 (జన సంఘర్షణ)

మెదక్ పట్టణంలోని డబుల్ బెడ్‌రూమ్ కాలనీలో చిన్నారులపై వీధి కుక్కల దాడులు రోజురోజుకు పెరుగుతుండటం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఇటీవల పలువురు చిన్నారులు కుక్కల కాటుకు గురై తీవ్రంగా గాయపడటం అత్యంత బాధాకరమైన విషయం. ఈ ఘటనలతో కాలనీవాసులు భయాందోళనలకు గురవుతున్నారు. చిన్నారులు బయటకు వెళ్లి ఆడుకోవాలన్నా, పాఠశాలకు వెళ్లాలన్నా తల్లిదండ్రులు భయపడే పరిస్థితి ఏర్పడింది. ఈ సమస్యను అత్యంత అత్యవసరంగా పరిగణించి మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి తగిన చర్యలు చేపట్టాలని కోరుతున్నాము.

మా ప్రధాన డిమాండ్లు: డబుల్ బెడ్‌రూమ్ కాలనీలో సంచరిస్తున్న వీధి కుక్కలను తక్షణమే పట్టుకోవాలి. ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలి. కుక్కల దాడికి గురైన చిన్నారులకు అవసరమైన వైద్య సహాయం అందేలా చర్యలు తీసుకోవాలి. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా సమగ్ర కార్యాచరణ చేపట్టాలి. మెదక్ మున్సిపల్ చైర్మన్ , కమిషనర్ లు ఈ విషయాన్ని అత్యంత అత్యవసరంగా పరిగణించి వెంటనే స్పందించి ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించాలని మనవి చేస్తున్నాము.ప్రజల భద్రతే మొదటి ప్రాధాన్యత కావాలి.



# గురు పౌర్ణమి సందర్భంగా శ్రీ సంతు రవిదాస్ మహారాజ్ 650వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించిన బీజేపీ ఎస్సీ మోర్చా నాయకులు

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జులై 22 (జన సంఘర్షణ)



మెదక్ జిల్లా రామాయంపేట భారతీయ జనతా పార్టీ రామాయంపేట కార్యాలయంలో బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు మస్కూరి బాలరాజ్ ఆధ్వర్యంలో గురు పౌర్ణమి సందర్భంగా శ్రీ సంతు రవిదాస్ మహారాజ్ 650 వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహనీయుడి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మస్కూరి బాలరాజ్ మాట్లాడుతూ, శ్రీ సంతు రవిదాస్ మహారాజ్ సనాతన ధర్మ పరిరక్షణకు, సమాజంలో సమానత్వం నెలకొల్పడానికి, భక్తి మార్గాన్ని ప్రజలకు చాటిచెప్పడానికి తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడని కొనియాడారు. చెప్పులు తయారు చేసే కుటుంబంలో జన్మించినప్పటికీ అనేక అవమానాలు, కష్టనష్టాలు ఎదుర్కొంటూ ధర్మమార్గాన్ని విడిచిపెట్టకుండా నిలబడ్డారని తెలిపారు.కాశీని కేంద్రంగా చేసుకుని సనాతన ధర్మం,భక్తి, మానవత్వం, సమానత్వం వంటి విలువలను దేశవ్యాప్తంగా ప్రచారం చేస్తూ హిందూ ధర్మ పరిరక్షణకు విశేష కృషి చేశారని అన్నారు.ఎన్ని వేధింపులు ఎదురైనా వెనుకడుగు వేయకుండా ధర్మరక్షణే తన జీవిత లక్ష్యంగా భావించి సమాజానికి ఆదర్శంగా నిలిచారని పేర్కొన్నారు.శ్రీ సంతు రవిదాస్ మహారాజ్ బోధించిన మానవ సేవే మాధవ సేవ ప్రేమ, సమానత్వం,భక్తి,సామాజిక సామరస్యం వంటి సందేశాలను ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని పిలుపునిచ్చారు. గురు పౌర్ణమి సందర్భంగా ఆయన ఆశయాలను స్మరించుకుంటూ ధర్మ పరిరక్షణ,సమాజ సేవ కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యత నిర్వర్తించాలని మస్కూరి బాలరాజ్ కోరారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ నాయకులు, ఎస్సీ మోర్చా నాయకులు, కార్యకర్తలు, పలువురు భక్తులు పాల్గొని శ్రీ సంతు రవిదాస్ మహారాజ్‌కు ఘనంగా నివాళులు అర్పించారు.

# జన్మభూమి కాలనీలో నీటి సమస్యను అధికారులతో పరిశీలించిన కాంగ్రెస్ నాయకులు జిల్లా గణేష్ నేత

హైదరాబాద్ సిటీ, శేరిలింగంపల్లి ప్రతినిధి అంజిబాబు, జూలై 29, (జన సంఘర్షణ):

శేరిలింగంపల్లి నియోజకవర్గం ఆల్విన్ కాలనీ ఉమ్మడి 124 డివిజన్ పరిధిలో నెలకొన్న నీటి సమస్యను స్థానికులు మహిళలు కాలనీ వాసులు పిఏసీ చైర్మన్ ఎమ్మెల్యే గాంధీ దృష్టికి తీసుకెళ్లగా వారి సమస్య తీవ్రతను గ్రహించిన గాంధీ ఆదేశాలతో క్షేత్రస్థాయిలో వాటర్ వర్క్స్ అధికారులు మేనేజర్ అనిల్ ఫీల్డ్ ఆఫీసర్ శ్రీనివాస్ తో పాటు స్థానిక కాంగ్రెస్ నాయకులు జిల్లా గణేష్ నేత పరిశీలించారు. వారు గత వారం రోజులుగా నిల్లు రావడం లేదని ఆ నీటికోసం పడిగాపులు కాస్తూ ఉద్యోగాలకు వెళ్లలేక పోతున్నామని లైనమాన్ కరుణాకర్ సరియైన సమాధానం ఇవ్వడని వారు విన్నపించుకున్నారు ఈ విషయమై జిల్లా గణేష్ అధికారులకు వెంటనే నీళ్లు వదలాలి చెప్పి దగ్గరుండి నీటిని విడుదల చేయించడం జరిగింది. అలాగే వారికి కేటాయించిన సమయంలో తప్పకుండా నీటిని వదలని ఇక్కడ అందరూ లేబర్ పనులకు వెళ్తారని వారు నీటికోసం వేచిచూసి ఉపాది కోల్పోవడం బాధాకరమని అన్నారు మళ్ళీ ఇలాంటి పరిస్థితి రాకూడదని అధికారులకు చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ యువ నాయకులు రెహమాన్, నాగరాజు,సుంకన్న,నాయకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.




# ప్రజలకు, శ్రేయోభిలాషులకు గురుపూర్ణిమ శుభాకాంక్షలు

- **టీపీసీసీ ఉపాధ్యక్షులు, కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ , తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్.**


హైదరాబాద్ సిటీ, కూకట్పల్లి ప్రతినిధి అంజిబాబు, జూలై 29, (జన సంఘర్షణ):




గురువు సాక్షాత్తు దైవంతో సమానమని, గురువు ఆశీస్సులు ఉంటే జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవడం సులభమని టీపీసీసీ ఉపాధ్యక్షులు, కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి, తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ పేర్కొన్నారు. గురుపూర్ణిమ సందర్భంగా బండి రమేష్ భరత్ నగర్, కేపీహెచ్‌బీ, బాలాజీ నగర్ ప్రాంతాల భక్తులతో కలిసి కాలనీలోని సాయిబాబా, దత్తాత్రేయ స్వామివారి దేవాలయాలు దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీస్సులు పొందారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భారతీయ సంస్కృతిలో గురువుకు అత్యున్నత స్థానం ఉందని, గురువు చూపిన మార్గంలో నడిచే వారికి జ్ఞానం, సంస్కారం, విజయం సిద్ధిస్తాయని అన్నారు. సమాజ నిర్మాణంలో గురువుల పాత్ర ఎనలేనిదని, ప్రతి ఒక్కరూ తమ జీవితంలో మార్గదర్శకులైన గురువులను గౌరవించి వారి ఆశీస్సులు పొందాలని పిలుపునిచ్చారు. గురుపూర్ణిమ పర్వదినాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రజలకు, కూకట్పల్లి నియోజకవర్గ ప్రజలకు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు శ్రేయోభిలాషులందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాగిరెడ్డి, తూము వేణు, పుష్ప రెడ్డి, గాలి బాలాజీ, సాధు ప్రతాప్ రెడ్డి, రంగమోహన్, తూము సంతోష్, దినేష్, కొండల్, శంకర్, అశోక్, రాజేష్, ప్రకాష్, రాజా, గోపాల్ చౌదరి, ఆదినారాయణ, సంధ్య, సుజాత, వాణి తదితరులు పాల్గొన్నారు.

# గురు పౌర్ణమి మహోత్సవంలో కుటుంబ సమేతంగా పాల్గొన్న జనసేన నాయకులు ప్రేమ కుమార్

హైదరాబాద్ సిటీ, కూకట్పల్లి ప్రతినిధి అంజిబాబు, జూలై 29, (జన సంఘర్షణ):



బుధవారం రోజు కెపిహెచ్బి కాలనీ 2వ రోడ్ లో గల శ్రీ షిరిడి సాయిబాబా దేవాలయం కమిటీ అధ్యక్షులు ఎల్.నాగేశ్వరరావు, ఎల్.రాజా ఆహ్వానం మేరకు కూకట్‌పల్లి నియోజకవర్గ జనసేన పార్టీ కంటెస్ట్ ఎమ్మెల్యే ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ గురుపౌర్ణమి మహోత్సవ సందర్భంగా జరిగిన ప్రత్యేక పూజలకు కుటుంబ సమేతంగా పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించి,అన్న ప్రసాద విత్తరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం దేవాలయ కమిటీ అధ్యక్షులు ప్రేమ కుమార్ దంపతులను శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు కొల్లా శంకర్ , దుత్త శంకర్ ,సుంకర సాయి,సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

# పి.వి శ్రీ రమణ తండ్రి స్వర్గీయ పరిమి వెంకయ్య దశదినకర్మ కార్యక్రమం

- **ఘనంగా నివాళులు అర్పించిన తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు కట్టెల మల్లేశం, కూకట్పల్లి అధ్యక్షులు ఎర్ర యాకయ్య.**

హైదరాబాద్ సిటీ, కూకట్పల్లి ప్రతినిధి అంజిబాబు, జూలై 29, (జన సంఘర్షణ):




కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలోని కేపీహెచ్‌బీ కాలనీ రోడ్ నెంబర్ మూడులో నివాసముంటున్న పీ వి శ్రీ రమణ తండ్రి స్వర్గీయ పరిమి వెంకయ్య దశదినకర్మ కార్యక్రమం బుధవారం రోజు కుటుంబ సభ్యులు, బంధు మిత్రుల సమక్షంలో నిర్వహించబడింది. స్వర్గీయ పరిమి వెంకయ్య చిత్రపటానికి తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు కట్టెల మల్లేశం, ఉపాధ్యక్షులు వంగాల కొండల్ రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మహేందర్, కూకట్పల్లి అధ్యక్షులు ఎర్ర యాకయ్య, పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం వెంకయ్య ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థించి, కుటుంబ సభ్యులను పరామర్శిస్తూ వారికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ కూకట్పల్లి జనరల్ సెక్రటరీ నాగుల అంజిబాబు, ఆర్గనైజింగ్ సెక్రటరీ నాగార్జున, ఈసీ మెంబర్ సుజాత, అనిల్ కిషోర్, శివ, రామకృష్ణ, బి. శ్రీధర్, జి. శ్రీధర్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆగస్టు 2న రుద్రూర్‌లో ఘనంగా బోనాల పండుగ

- **ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలకు ఆహ్వానం పలికిన గ్రామ సర్పంచ్, గ్రామ పెద్దలు**

నిజామాబాద్ బ్యూరో / జూలై 29 (జన సంఘర్షణ):



రుద్రూర్ మండల కేంద్రంలో ఆగస్టు 2న నిర్వహించనున్న బోనాల పండుగను ఘనంగా నిర్వహించేందుకు గ్రామస్థులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా బోనాల పండుగకు ముఖ్య అతిథులుగా హాజరుకావాలని కోరుతూ రుద్రూర్ గ్రామ సర్పంచ్ ఇందూరు సునీత చంద్రశేఖర్, ప్రముఖ న్యాయవాది వెంకటేశ్వరరావు దేశాయ్‌తో పాటు గ్రామ పెద్దలు ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులను కలిసి ఆహ్వానించారు.ఈ మేరకు బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి, బోధన్ ఎమ్మెల్యే, ప్రభుత్వ సలహాదారు పొద్దుటూరి సుదర్శన్ రెడ్డి, బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, బీజేపీ మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణలను ప్రత్యేకంగా కలిసి బోనాల పండుగకు హాజరుకావాలని ఆహ్వానించారు. గ్రామంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్న బోనాల పండుగకు తప్పక హాజరై అమ్మవారి ఆశీస్సులు పొందాలని ఆహ్వానించగా, నాయకులందరూ సానుకూలంగా స్పందించినట్లు సర్పంచ్ ఇందూరు సునీత చంద్రశేఖర్, ప్రముఖ న్యాయవాది వెంకటేశ్వరరావు దేశాయ్ తెలిపారు. బోనాల పండుగను విజయవంతం చేసేందుకు గ్రామ ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు.

# నెమలి సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు

- **ప్రత్యేక పూజల్లో పాల్గొన్న కామారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్**

నసురుల్లాబాద్, జూలై 29 (జన సంఘర్షణ):



కామారెడ్డి జిల్లా బాన్సువాడ నియోజకవర్గం నసురుల్లాబాద్ మండలం నెమలి గ్రామంలోని సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుల ఆహ్వానం మేరకు కామారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్ ఈ కార్యక్రమానికి హాజరై సాయిబాబాను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజల సుఖశాంతులు, ఆయురారోగ్యాలతో పాటు రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని సాయిబాబాను ప్రార్థించినట్లు తెలిపారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఆర్ఐ భుజంగారి భాస్కర్ రెడ్డి, నిజాంసాగర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ప్రజా పండరి, నసురుల్లాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు విజయ్ కుమార్ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు యశ్వంత్ రెడ్డి, కమ్మ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# రక్షించాల్సిన ఖాకీనే కీచకుడిగా మారితే సహించేది లేదు

- జూబ్లీహిల్స్ సీఐ సస్పెండ్.. ఉన్నతాధికారుల కఠిన హెచ్చరిక
- హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్ ఆదేశాలు



హైదరాబాద్,/ జూలై 29/(జన సంఘర్షణ)
న్యాయం కోసం పోలీస్ స్టేషన్ మెట్లు ఎక్కిన ఓ మహిళకు రక్షణ కల్పించాల్సిన పోలీసు అధికారే నమ్మకద్రోహానికి పాల్పడ్డారనే ఆరోపణలు తీవ్ర కలకలం రేపుతున్నాయి. జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ సీఐగా పనిచేస్తున్న శ్రీనివాస్ రెడ్డి తన సమస్యను పరిష్కరిస్తానని నమ్మించి లైంగికంగా వేధించారని, సన్నిహిత వీడియోలను రికార్డు చేసి బెదిరింపులకు పాల్పడ్డారని బాధితురాలు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఈ ఫిర్యాదు నేపథ్యంలో పోలీస్ శాఖ ఉన్నతాధికారులు విషయాన్ని తీవ్రంగా పరిగణించారు. పోలీసు వ్యవస్థ ప్రతిష్టకు భంగం కలిగించేలా వ్యవహరించిన ఆరోపణలపై జూబ్లీహిల్స్ సీఐ శ్రీనివాస్ రెడ్డిని సస్పెండ్ చేస్తూ హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్ ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. ఈ సందర్భంగా ఉన్నతాధికారులు స్పష్టమైన హెచ్చరికలు జారీ చేశారు. ప్రజలను రక్షించాల్సిన బాధ్యతలో ఉన్న పోలీసులు తమ అధికారాన్ని దుర్వినియోగం చేస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని, చట్టానికి ఎవరూ అతీతులు కాదని హెచ్చరించారు. బాధితులకు న్యాయం చేయాల్సిన పోలీసులే నిబంధనలు ఉల్లంఘిస్తే వారిపై మరింత కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. అధికారాన్ని అడ్డంగా ఉపయోగించి ప్రజలను ఇబ్బందులకు గురిచేసే వారిని ఎంతటి స్థాయిలో ఉన్నా వదిలిపెట్టబోమని ఉన్నతాధికారులు తేల్చిచెప్పారు. పోలీసు శాఖలో పనిచేస్తున్న ప్రతి అధికారి ప్రజల పట్ల బాధ్యతాయుతంగా, నిష్పక్షపాతంగా వ్యవహరించాలని, మహిళల భద్రత విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఘటనపై పూర్తి స్థాయి విచారణ కొనసాగుతున్నట్లు సమాచారం. విచారణలో వెలుగులోకి వచ్చే అంశాల ఆధారంగా తదుపరి చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

# నిరుద్యోగ యువతకు శుభవార్త..!

- రాష్ట్రంలో 7,437 పోలీసు ఉద్యోగాలకు భారీ నోటిఫికేషన్ విడుదల




పోతంగల్/, జూలై 29/
హైదరాబాద్ తెలంగాణలో ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగ యువతకు రాష్ట్ర ప్రభుత్వం గుడ్ న్యూస్ అందించింది. మొత్తం 7,437 పోలీసు శాఖ ఉద్యోగాల భర్తీకి తెలంగాణ పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు (టీజీపీఆర్‌బీ) అధికారికంగా నోటిఫికేషన్ విడుదల చేసింది. అర్హత కలిగిన అభ్యర్థులు నిర్ణీత గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు.

ఖాళీల వివరాలు:.. సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్ఐ – సివిల్) -- 148 పోస్టులు
పోలీసు కానిస్టేబుల్ (సివిల్) – 3,697 పోస్టులు
పోలీసు కానిస్టేబుల్ (ఆర్మ్డ్ రిజర్వ్ – ఏఆర్) – 1,052 పోస్టులు
స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (ఎస్‌పీఎఫ్) కానిస్టేబుల్ – 1,380 పోస్టులు
ఫైర్ ఫైటర్ (అగ్నిమాపక సిబ్బంది) – 751 పోస్టులు
మొత్తం ఖాళీలు: 7,437

అభ్యర్థులు అర్హతలు, వయోపరిమితి, దరఖాస్తు విధానం, ఎంపిక ప్రక్రియ, పరీక్షా విధానం, దరఖాస్తు తేదీలు తదితర పూర్తి వివరాలను తెలంగాణ పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు (టీజీపీఆర్‌బీ) అధికారిక వెబ్‌సైట్‌లో తెలుసుకోవచ్చు. నిరుద్యోగ యువతకు ఇది ఒక మంచి అవకాశం. అర్హత ఉన్న ప్రతి అభ్యర్థి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

# ఎనిమిదేళ్లుగా నిలిచిపోయిన బ్రిడ్జి నిర్మాణం..

- ఒక్క వర్షానికే రోడ్డు కొట్టుకుపోయింది
- ప్రాణాలకు తెగించి ప్రయాణం.. వెంటనే బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయాలని ప్రజల డిమాండ్





రుద్రూర్ మండలం, జూలై 29 (జనసంఘర్షణ):
రుద్రూర్ మండలంలోని రాయ్కూర్ గ్రామం నుంచి బోధన్‌కు వెళ్లే ప్రధాన రహదారిపై నిర్మాణంలో ఉన్న బ్రిడ్జి గత ఎనిమిదేళ్లుగా అసంపూర్తిగానే ఉండిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తాజాగా కురిసిన వర్షాలకు బ్రిడ్జి పక్కనున్న రహదారి కొట్టుకుపోవడంతో రాకపోకలు మరింత ప్రమాదకరంగా మారాయి. ఒక్క వర్షానికే రోడ్డు దెబ్బతినడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని స్థానికులు మండిపడుతున్నారు. బోధన్‌కు వెళ్లే రైతులు, విద్యార్థులు, ఉద్యోగులు, అత్యవసర సేవల కోసం ప్రయాణించే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాహనాలు వెళ్లే పరిస్థితి లేకపోవడంతో ప్రత్యామ్నాయ మార్గాల్లో ప్రయాణించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎనిమిదేళ్లుగా పనులు ఎందుకు నిలిచిపోయాయో అధికారులు ప్రజలకు సమాధానం చెప్పాలని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. కనీసం తాత్కాలికంగా మొరం వేసి రాకపోకలకు అనువుగా రోడ్డు ఏర్పాటు చేయడంలో కూడా సంబంధిత శాఖలు పూర్తిగా విఫలమయ్యాయని విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, సంబంధిత అధికారులు స్పందించి బ్రిడ్జి నిర్మాణాన్ని యుద్ధప్రాతిపదికన పూర్తి చేయడంతో పాటు దెబ్బతిన్న రహదారిని వెంటనే పునరుద్ధరించాలని రైతులు, వాహనదారులు, గ్రామస్థులు డిమాండ్ చేశారు. మరింత ఆలస్యం చేస్తే పెద్ద ప్రమాదం జరిగే అవకాశం ఉందని హెచ్చరిస్తూ, ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడొద్దని అధికారులను కోరారు.

# హంగర్గా ఫారం గ్రామంలో గ్రామ సభ
















- గ్రామ అభివృద్ధికి కీలక తీర్మానాలు.. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు
- నీటి వృథా, బహిరంగ మలవిసర్జన, బాల్య వివాహాలు, గంజాయి-డ్రగ్స్‌పై గ్రామసభలో గట్టి హెచ్చరిక

పోతంగల్, జూలై 29 (జన సంఘర్షణ):
పోతంగల్ మండలంలోని హంగర్గా ఫారం గ్రామంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళల గ్రామసభ, స్వయం సహాయక సంఘాల (డ్వాక్రా) మహిళల సమావేశంతో పాటు బాలల గ్రామసభను కూడా నిర్వహించారు. గ్రామ అభివృద్ధి, ప్రజల ఆరోగ్యం, పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ, మహిళలు మరియు బాలల భద్రతకు సంబంధించి పలు కీలక తీర్మానాలను గ్రామసభలో ఆమోదించారు.

ప్రతి ఇంటికి నల్లాకు టాప్ తప్పనిసరి: కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి ఇంటి నల్లాకు టాప్ (కుళాయి మూత) ఏర్పాటు చేసుకోవాలని తీర్మానించారు. తాగునీటిని వృథా చేస్తే గ్రామపంచాయతీ నిబంధనల ప్రకారం రూ.5,000 జరిమానా విధించనున్నట్లు హెచ్చరించారు.

**నీటి సంరక్షణకు ఇంకుడు గుంతలు:** వర్షపు నీటిని భూగర్భ జలాలుగా మార్చేందుకు ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంత (సోక్ పిట్) నిర్మించుకోవాలని సూచించారు. అలాగే వ్యవసాయ భూముల్లో పంట కుంటలు నిర్మించుకుని వర్షపు నీటిని సంరక్షించాలని గ్రామసభ పిలుపునిచ్చింది. బాల్య వివాహాలకు నో:లి గ్రామంలో ఎవరూ బాల్య వివాహాలు చేయరాదని, బాల్య వివాహాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని గ్రామపంచాయతీ తీర్మానించింది. బాల్య వివాహాల గురించి సమాచారం తెలిసిన వారు వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేయాలని సూచించారు.

**బహిరంగ మలవిసర్జనపై కఠిన చర్యలు:** ప్రతి కుటుంబం వ్యక్తిగత మరుగుదొడ్డి నిర్మించుకోవాలని గ్రామసభ సూచించింది. బహిరంగ ప్రదేశాల్లో మలవిసర్జన చేస్తే రూ.5,000 జరిమానా విధించేలా గ్రామపంచాయతీ తీర్మానం చేసినట్లు తెలిపారు.

**గంజాయి, డ్రగ్స్‌పై ఉక్కుపాదం:** గ్రామంలో గంజాయి, మాదకద్రవ్యాల (డ్రగ్స్) విక్రయం లేదా వినియోగాన్ని పూర్తిగా అరికట్టాలని గ్రామసభ నిర్ణయించింది. గంజాయి, డ్రగ్స్ విక్రయిస్తున్న వ్యక్తుల గురించి సమాచారం అందించిన వారికి రూ.10,000 నగదు బహుమతి గ్రామపంచాయతీ తరపున అందజేస్తామని, సమాచారం ఇచ్చిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని ప్రకటించారు. గంజాయి లేదా మాదకద్రవ్యాలు వినియోగిస్తూ పట్టుబడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

**మైనర్లకు సిగరెట్లు, గుట్కా విక్రయిస్తే చర్యలు:** 21 సంవత్సరాలు నిండని వారికి సిగరెట్లు, గుట్కా వంటి పొగాకు ఉత్పత్తులు విక్రయించరాదని కిరాణా దుకాణదారులకు సూచించారు. నిబంధనలు ఉల్లంఘించి విక్రయిస్తే రూ.5,000 జరిమానా విధించేలా గ్రామపంచాయతీ తీర్మానించినట్లు తెలిపారు.


**కాలం చెల్లిన వస్తువులు విక్రయిస్తే జరిమానా:** కిరాణా దుకాణాల్లో కాలం చెల్లిన వస్తువులు (ఎక్స్‌పైరీ వస్తువులు) విక్రయించరాదని హెచ్చరించారు. ఎక్స్‌పైరీ అయిన ఆహార పదార్థాలు లేదా ఇతర వస్తువులు విక్రయించినట్లు గుర్తిస్తే రూ.5,000 జరిమానా విధించేలా గ్రామపంచాయతీ తీర్మానం చేసింది.

**గ్రామసభ తీర్మానాలు.. ప్రతి ఒక్కరూ పాటించాలి**

గ్రామ అభివృద్ధి, ప్రజల ఆరోగ్యం, పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ కోసం గ్రామసభలో తీసుకున్న తీర్మానాలను ప్రతి గ్రామస్థుడు బాధ్యతగా పాటించాలని అధికారులు, ప్రజాప్రతినిధులు సూచించారు. గ్రామ నిబంధనలను ఉల్లంఘించి ప్రజలకు ఇబ్బంది కలిగించే వారిపై ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గకుండా నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామపంచాయతీ సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు, బాలలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# బాన్సువాడలో వీధి కుక్కల భీభత్సం





- నలుగురు చిన్నారులకు గాయాలు.. ఇద్దరి పరిస్థితి విషమం
- ఇకనైనా మున్సిపల్ అధికారులు మేల్కొనాలి.. కుక్కల బెడదకు శాశ్వత పరిష్కారం చూపాలి

బాన్సువాడ, జూలై 29 (జన సంఘర్షణ):
బాన్సువాడ పట్టణంలో వీధి కుక్కలు మరోసారి భీభత్సం సృష్టించాయి. బుధవారం పట్టణంలోని వివిధ కాలనీల్లో వీధి కుక్కల దాడిలో నలుగురు చిన్నారులు తీవ్రంగా గాయపడటం స్థానికంగా కలకలం రేపింది. వీరిలో ఇద్దరు చిన్నారుల పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం నిజామాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

**గాయపడిన చిన్నారులు..:** 1. అర్షా ఫాతిమా – 13 సంవత్సరాలు, 2. జైనబ్ – 3 సంవత్సరాలు, 3. సాయి రిత్విక్ – 6 సంవత్సరాలు, 4. హర్ష వర్ధిని – 10 సంవత్సరాలు

స్థానికుల కథనం ప్రకారం.. పిల్లలు ఇళ్ల ముందు ఆడుకుంటుండగా ఒక్కసారిగా వీధి కుక్కల గుంపు వారిపై దాడి చేసింది. చిన్నారుల కేకలు విన్న స్థానికులు వెంటనే అక్కడికి చేరుకుని కుక్కలను తరిమికొట్టి పిల్లలను రక్షించారు. దాడిలో తీవ్రంగా గాయపడిన 3 ఏళ్ల జైనబ్, 6 ఏళ్ల సాయి రిత్విక్ పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం నిజామాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. మరో ఇద్దరు చిన్నారులకు బాన్సువాడ ఏరియా ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు.

**మున్సిపల్ అధికారులు ఇకనైనా మేల్కొనాలి**

ఈ ఘటనతో బాన్సువాడ పట్టణ ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో వీధి కుక్కల సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్నా సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చిన్నారులు, వృద్ధులు, మహిళలు రోడ్లపై స్వేచ్ఛగా తిరగలేని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు చిన్నారులపై వరుసగా కుక్కల దాడులు జరుగుతుంటే.. మరోవైపు అధికారులు స్పందించకపోవడం ఎంతవరకు సమంజసం? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. చిన్నారుల ప్రాణాలకు ముప్పు ఏర్పడిన తర్వాత కూడా అధికారులు నిద్రలోనే ఉంటే మరెన్ని ఘటనలు జరగాలని ప్రజలు నిలదీస్తున్నారు.

**వెంటనే ప్రత్యేక చర్యలు చేపట్టాలి**

బాన్సువాడ మున్సిపల్ కమిషనర్, చైర్‌పర్సన్ తక్షణమే స్పందించి పట్టణంలోని వీధి కుక్కల సమస్యపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. మున్సిపల్ సిబ్బందిని రంగంలోకి దించి కుక్కల నియంత్రణకు తక్షణ చర్యలు చేపట్టడంతో పాటు, కుక్కల బెడద ఎక్కువగా ఉన్న ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని కోరుతున్నారు. ప్రజల ప్రాణ భద్రత విషయంలో నిర్లక్ష్యానికి తావులేదని, చిన్నారులపై మరో దాడి జరగకముందే మున్సిపల్ యంత్రాంగం మేల్కొని తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు స్పష్టం చేస్తున్నారు. కేవలం ఘటన జరిగిన తర్వాత స్పందించడం కాకుండా, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. ఇదిలా ఉండగా, తల్లిదండ్రులు చిన్నారులను ఒంటరిగా బయటకు పంపకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, వీధి కుక్కలు గుంపులుగా కనిపించినప్పుడు వాటికి దూరంగా ఉండాలని సూచిస్తున్నారు.

Printed, published and owned by **Rachamallu Madhavi** Printed at **Kranthi Printing Press**, 42/603/1/1-a, Mj Colony, Street no 5, Mjcolony, Moulali Secundrabad, and Published from h.no: 10-10-117/150, Nayi brahmana colony. Neerugonda Hanuman road, Nagaram Nizamabad (m&d) 503001, Telangana, Editor : **Rachamallu Madhavi**. **RNI Reg No :tel/2024/89323,** Cell 6305026524, Email:janasangarshana@gmail.co